# క్రైమ్ మిర్రర్®
THE
Voice of Anti Corruption

హైదరాబాద్
26-7-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 124

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## టిడిపికి కొత్త ఇన్చార్జిలు!

**విజయవాడ పశ్చిమానికి బుద్దా వెంకన్న**

**అవనిగడ్డకు విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు**

**హై కమాండ్ కీలక నిర్ణయాలు**

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** తెలుగుదేశం పార్టీ దూకుడుగా ఉంది. అత్యంత దూకుడు నిర్ణయాలు తీసుకుంటోంది. అందులో భాగంగా మిత్రపక్షానికి చెందిన ఎమ్మెల్యేలు ఉన్నచోట.. కొత్తగా టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి లను నియమించింది. ముఖ్యంగా రెండు నియోజకవర్గాలను భర్తీ చేసింది.

మిగతా 3లో



## కోమటిరెడ్డి బ్రదర్స్‌పై తిరుగుబాటు!

**తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించిన తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు**

**నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశంతో కలిసి హైకమాండ్ కు ఫిర్యాదు**

**ప్రోత్సహించిన నేతలే ఇప్పుడు వ్యతిరేకం**



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీలో రాజకీయం మరోసారి పతాక స్థాయికి చేరింది.

మిగతా 2లో

# జెన్ జీ 'ధర్మం' గెలిచింది!

**కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా**

**ఉద్యమంతో విద్యార్థులు, నిరుద్యోగులు గట్టి సవాల్**

**తలొగ్గిన కేంద్రం**





**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోడీకి పంపించారు. సోషల్ మీడియా వేదికగా ప్రారంభమై.. వీధుల దాకా వ్యాపించిన జెన్ జీ తీవ్ర నిరసనల ముందు, యువత ఆగ్రహానికి కేంద్ర క్యాబినెట్ మంత్రి రాజీనామా చేయని తప్పని పరిస్థితి ఏర్పడింది.

కొద్ది రోజులుగా ఉద్యమం.. గత కొద్దిరోజులుగా విద్యార్థులతో పాటు నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు జరిపింది. దాని ఫలితమే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా. ఆయన తన రాజీనామాలు నైతిక బాధ్యతను ప్రస్తావించారు. బలమైన విద్యావ్యవస్థ సమర్థవంతమైన దేశానికి పునాదిగా అభివర్ణించారు.

విద్యార్థుల పోరాటానికి ఎట్టకేలకు కేంద్రం తలవొంచింది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ యువత చేపట్టిన చారిత్రాత్మక పోరాటానికి కేంద్రం తలవంచక తప్పలేదు. సంచలనం సృష్టించిన నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ, విద్యావ్యవస్థలోని లోపాలపై యువతరం ఉవ్వెత్తున ఎగసి పడింది. ఆందోళన కార్యక్రమాలు చేపట్టింది. దీనిపై కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయక తప్పలేదు.

మిగతా 3లో




## చట్టసభల వయోపరిమితి 21 ఏళ్లకు తగ్గించాలి

**అప్పుడే యువతకు రాజకీయ అవకాశాలు వస్తాయి**

**తెలంగాణ అసెంబ్లీలో ఈ మేరకు తీర్మానం చేస్తాం**

**కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న సిఎం రేవంత్**

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** చట్టసభలకు పోటీ చేసే వయసును 21 ఏళ్లకు తగ్గించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని, అప్పుడే నీతిమంతమైన రాజకీయాలు

- మిగతా 2వ పేజీలో

## జనసేనకు కొత్త నాయకత్వం!



**వివిధ దశల్లో పనిచేసేందుకు 36వేల మందికి పైగా సిద్ధం**

**దరఖాస్తులు స్వీకరించి.. వారి అర్హతకు అనుగుణంగా పదవులు**

**పవన్ కళ్యాణ్ పక్కా వ్యూహం**


2లో

# హైదరాబాదులో ఫ్లెక్సీల కలకలం!

**'బాప్ ఆప్ పేపర్ లీక్' అంటూ కేటీఆర్ పై ప్రశ్నల వర్షం**

**కాంగ్రెస్ వ్యూహాత్మక ప్రయోగం**

**బిజెపితో తెరచాటు బంధం అంటూ విమర్శలు**




**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:**
తెలంగాణలో ఫ్లెక్సీల కలకలం. ఢిల్లీలో విద్యార్థులు చేపట్టిన నిరసనలకు అనుబంధంగా.. తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు.. గులాబీ పార్టీ హయాంలో జరిగిన పేపర్ లీకుల ఘటనలపై ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో కేటీఆర్ ను ఉద్దేశిస్తూ హైదరాబాద్ నగరవ్యాప్తంగా 'బాప్ ఆప్ పేపర్ లీక్ ' అంటూ ఫ్లెక్సీలను అంటించారు. కేటీఆర్ పై సెటైర్లను సంధిస్తున్నారు. కేటీఆర్ కు బర్త్ డే గిఫ్ట్ అంటూ ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీలు తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్లో హాట్ టాపిక్ అవుతున్నాయి.

2లో



## ఏపీలో ఓట్లు గల్లంతు!

**సర్ ప్రక్రియతో సమూల ప్రక్షాళన**

**సమాచారం లభించని ఓటర్లు 45 లక్షలు**

**రాష్ట్ర ఓటర్లలో ఇది 10%**

**ఆందోళనలో రాజకీయ పార్టీలు**

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీకి షాకింగ్ పరిణామం. రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. క్షేత్రస్థాయిలో నిర్వహించిన ఈ సర్వేలో సేకరించిన సమాచారాన్ని ఆన్లైన్లో నమోదు చేసి డిజిటల్ ప్రక్రియను కూడా అధికారులు వేగవంతంగా ముగించారు. అయితే ఈ ప్రక్రియలో భాగంగా ఏపీవ్యాప్తంగా మొత్తం 45 లక్షల మంది ఓటర్లను సమాచారం లభించని వారుగా బిఎల్వోలు ప్రాథమికంగా గుర్తించారు. ఇది రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో ఏకంగా 10.74 శాతానికి సమానం. ఇది ఒక విధంగా సంచలనమే. ఎందుకంటే

3లో

## కుటుంబ వివాదంలో జోగి రమేష్!




**కోడలు ఫిర్యాదుతో 11 మందిపై కేసు**

**కుమారుడు, భార్యతో సహా అందరిపై గృహహింస, హత్యాయత్నం సెక్షన్లు**

**చిక్కుల్లో మాజీమంత్రి ఫ్యామిలీ**

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు కేసులు వెంటాడుతున్నాయి. ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం కేసులతో ఉక్కు పాదం

2లో

## ఏసీబీ చేతిలో అవినీతి చిట్టా!

**ఇక ఐఏఎస్, ఐపీఎస్ లపై గురి**

**లంచగొండి అధికారుల జాబితా సిద్ధం**

**మున్ముందు మరిన్ని సంచలనాలు**

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో ఏసీబీ పంజా విసరబోతోందా? ఇకనుంచి ఐఏఎస్ లను టార్గెట్ చేయనుందా? ఐపీఎస్ ల పై సైతం గురిపెట్టనుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. తెలంగాణ అవినీతి నిరోధక శాఖ వ్యవస్థలోని



# హైదరాబాదులో ఫ్లెక్సీల కలకలం!

(మొదటి పేజీ తరువాయి)

**సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం..**

హైదరాబాద్ వ్యాప్తంగా ఫ్లెక్సీలు మాత్రమే కాదు.. సోషల్ మీడియా వేదికగా కూడా పాత కేటీఆర్ వీడియోలను తీసుకొచ్చి పేపర్ లీకేజీ అంశంపై.. గులాబీ పార్టీని ఎరకాటంలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కేటీఆర్ పై వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల పై పలు ప్రశ్నలు రాసి వాటికి సమాధానం చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. నీ పాలనలోని పేపర్ లీకులపై ఏం చేస్తారు అంటూ నిలదీసినంత పని చేస్తున్నారు. అప్పట్లో అనేకమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. అప్పటి ఘటనలను తొక్కిపెట్టి.. ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారంటూ ఎద్దేవా చేస్తున్నారు.

**సీఎం రేవంత్ విసుర్లు..**

మరోవైపు పేపర్ లీకేజీ అస్త్రాలను బయటకు తీసి గులాబీ పార్టీని ఇరకాటంలో పెట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి దీనిని ఒక ప్రచార అస్త్రంగా చేసుకున్నారు. ఇప్పటికే కేటీఆర్ ను టార్గెట్ చేసి విమర్శలు చేశారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తుంటే భారత రాష్ట్ర సమితి ఎందుకు మౌనంగా ఉందంటూ ప్రశ్నించారు. బిజెపితో తెరచాటు బంధమే అందుకు కారణం అని ఆరోపణలు చేశారు. ఇలాంటి పార్టీలు రాష్ట్రానికి అవసరమా? అని ప్రశ్నించారు. విద్యార్థుల తరపున మాట్లాడే హక్కు కానీ.. ప్రశ్నించే హక్కు కానీ కేటీఆర్ కు లేదని సీఎం అన్నారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నేతఏకకాలంలో బిజెపి, బీఆర్ఎస్ ను టార్గెట్ చేస్తున్నారు. ˇలు తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు.

# కుటుంబ వివాదంలో జోగి రమేష్!

మోపగా.. ఇప్పుడు వ్యక్తిగత అంశాల్లో సైతం ఒక్కో నేత కేసుల బారిన పడుతున్నారు. జైలుకు వెళ్తున్నారు. తాజాగా మాజీ మంత్రి జోగి రమేష్ ఫ్యామిలీ చిక్కుల్లో పడింది. వారిపై గృహహింసకేసు నమోదయింది. జోగి రమేష్ కుమారుడు రాజీవ్ భార్య మేఘన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. తనపై హత్యాయత్నం, గృహహింస, వరకట్న వేధింపులకు పాల్పడ్డారని.. మోసం చేశారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. మేఘన ఫిర్యాదుతో.. జోగి రమేష్, ఆయన భార్య శకుంతల, రాజీవ్ తో సహా 11 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు బిగుసుకునే అవకాశం కనిపిస్తోంది.

**ఏడాది కిందట వివాహం..**

జోగి రమేష్ పెద్ద కుమారుడు రాజీవ్ కు తెలంగాణలోని సూర్యాపేటకు చెందిన మేఘనతో 2025 మే 28న వివాహమయింది. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. అయితే తనకు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు అంటూ మేఘన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మేఘన తన ఫిర్యాదులు భర్త రాజీవ్ తో పాటు అత్తమామలు జోగి రమేష్, శకుంతల, మరిది రోహిత్, ఆడపడుచు ప్రియాంక, జోగి రమేష్ సోదరుడు రాము, ఆయన కుమారులు రాజేష్ పండు.. రమేష్ బావమరిది స్వామి, ఆయన భార్య రమ, కుమారుడు సంతోష్ పేర్లను ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో వారిపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

**వరుసగా కేసులు..**

ఇప్పటికే అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో జోగి ఫ్యామిలీ చిక్కుకుంది. జోగి రమేష్ కుమారుడు రాజీవ్ అరెస్టయ్యారు కూడా. ప్రస్తుతం ఆయన బెయిల్ పై ఉన్నారు. ఇంతలోనే భార్యను హింసించిన కేసు నమోదయింది. అయితే కుటుంబ వ్యవహారాన్ని పరిష్కరించడంలో జోగి రమేష్ విఫలమయ్యారు. కుటుంబ వ్యవహారాలతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు వరుసగా కేసుల్లో చిక్కుకోవడం, అరెస్టులకు గురికావడం సంచలనంగా మారుతోంది.

**కేసు నమోదు చేసిన పోలీసులు..**

జోగి రమేష్ కోడలు మేఘన ఒక్కసారిగా ఫిర్యాదు చేయడంతో కలకలం రేగింది. తనను శారీరకంగా, మానసికంగా తీవ్రంగా వేధిస్తున్నారని అత్తింటి వారిపై ఫిర్యాదు చేశారు. అదనపు కట్నం తీసుకురావాలంటూ తనను అత్తింటి వారు చిత్రహింసలకు గురిచేసారని మేఘన తన ఫిర్యాదులో ఆరోపించారు. తనను చంపేందుకు హత్యా ప్రయత్నం చేశారని కూడా పేర్కొన్నారు. ఇంట్లో గృహహింసను ఎదుర్కొంటున్నట్లు పోలీసులకు వివరించారు. పోలీసులు వారిపై మోసం, హత్యాయత్నం, వరకట్న వేధింపులు, గృహహింస తదితర కేసులు బుక్ చేశారు.

# ఏసీబీ చేతిలో అవినీతి చిట్టా!

కీలక అధికారులకు సంబంధించిన ఒక సమగ్రమైన దోపిడీ చిట్టాను సిద్ధం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అక్రమార్కులపై దాడికి రంగం సిద్ధం చేస్తోంది. ఇటీవల వివిధ కేసుల్లో బయటపడుతున్న అక్రమ ఆస్తులు, అంతర్గత శోధనలో లభించిన సమాచారం ఆధారంగా.. కీలక శాఖలో ఉన్నత పదవుల్లో ఉండి అక్రమార్జనలకు పాల్పడిన అధికారుల జాబితాను ఏసీబీ సిద్ధం చేసింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో ఈసారి ఏసీబీ వేస్తున్న అడుగులు అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నాయి.




**చిన్న ఆధారంతో డొంక..**

ఇటీవల డీఎస్పీ సంకిరెడ్డి భీమ్ రెడ్డిని ఏసీబీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈయన అరెస్టు వెనుక ఆసక్తికరమైన అంశం ఉంది. 2019 నాటి పాత కేసు తవ్వి తీసి విచారించడంతో పాటు ఒక ట్రాన్స్ఫర్ పిటిషన్ లో వచ్చిన చిన్న ఆధారంతో లోతుగా శోధించింది. విల్లాలు, ప్లాట్లు, మైనింగ్ కంపెనీలో పెట్టుబడులతో బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం.. ఏకంగా 150 కోట్లకు పైగా అక్రమస్తుల సామ్రాజ్యం బయటపడింది. ఇదే క్రమంలో డిస్కొంట్లలో ఏడీఈ గా పనిచేసిన ఒక ఇంజనీర్ వద్ద ఏకంగా 150 కోట్ల రూపాయలకు పైగా అక్రమ ఆస్తులు, భారీగా నగదును గుర్తించడం చూస్తుంటే అవినీతి ఏ స్థాయిలో పేరుకుపోయిందో అర్థం అవుతోంది.

**పెరిగిన అవినీతి..**

అవినీతి భారీ స్థాయిలో పెరిగింది. గతంలో కేవలం రూ.10,000 లేదా రూ.20,000 వరకు మాత్రమే లంచం కేసులు పరిమితం అయ్యేవి. ఏసీబీ ట్రాప్ లు ఇప్పుడు ఏకంగా వందల కోట్ల అక్రమ ఆస్తులను వెలుగు తీసేలా మారాయి. ఏకంగా బినామీ నెట్వర్కులను సైతం చేదిస్తోంది ఏసీబీ. గతంలో లంచాల ఆరోపణలు ఎదుర్కొని సురక్షితంగా బయటపడ్డామని భావిస్తున్న అధికారులు.. పాత ఫైళ్లను, జ్యుడీషియల్, సివిల్ విభాగాల్లో పని చేసిన అధికారుల వివరాలను సేకరించి సమగ్రంగా విచారణ జరుపుతున్నారు.

**సమగ్ర కసరత్తు..**

**ము**న్ముందు అవినీతి అధికారుల భరతం పట్టేందుకు ఏసీబీ గట్టి ప్రయత్నాలు పెట్టినట్లు ప్రచారం నడుస్తోంది. ఐఏఎస్,, ఐపీఎస్, రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగాల అధికారుల ఇళ్లపై దాడులకు కూడా వెనుకడుగు వేయకుండా సమగ్ర కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. బినామీల పేరుతో దాచిన డిజిటల్, రియల్ ఎస్టేట్ ఆధారాలను ఛేదించే కఠినమైన నెట్వర్క్ ను ఏసీబీ రూపొందించుకున్నట్లుగా తెలుస్తోంది. ఇకముందు పెద్ద తిమింగలాలను బోనులో నిలబెట్టేందుకు తెలంగాణ ఏసీబీ రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మున్ముందు మరిన్ని సంచలనాలు నమోదు కానున్నాయి.

# ఎల్‌నినోతో రైతులకు అండగా నిలవండి

**డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రోత్సహించండి**

**మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల సూచన**

హైదరాబాద్: ఎల్-నినో సమయంలో రైతులకు అండగా నిలవాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎల్-నినో సవాళ్లకు డ్రిప్, తుంపర సేద్యమే పరిష్కార మార్గమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ సచివాలయంలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశమయ్యారు. డ్రిప్ వ్యవస్థల ఏర్పాటును వేగవంతం చేయాలని ఆ కంపెనీలకు మంత్రి సూచించారు. పెండింగ్‌లో ఉన్న డ్రిప్ పనులకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. బీఎంఎస్, బీఓక్యూలను పూర్తి చేసి వెంటనే అనుమతుల కోసం పంపాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలన, పరిపాలనా అనుమతుల్లో జాప్యానికి తావివ్వొద్దని మంత్రి తుమ్మల సూచించారు. డ్రిప్ వ్యవసాయ పద్ధతిలో తక్కువ నీరు, విద్యుత్ ఉపయోగించి అధిక దిగుబడి సాధించవచ్చని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. పంటల వైవిధ్యీకరణకు మైక్రో ఇరిగేషన్ కీలకమని అన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు డ్రిప్ సదుపాయాలను వెంటనే కల్పించాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు హుకుం జారీ చేశారు. అవగాహన కార్యక్రమాల్లో ఆయా కంపెనీలు తప్పనిసరిగా పాల్గొనాలని, పెండింగ్ బిల్లుల చెల్లింపునకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గత రెండేళ్లలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.400 కోట్లు చెల్లించిందని ఈ సందర్భంగా వెల్లడించారు.



# టిడిపికి కొత్త ఇన్చార్జిలు!

విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి బుద్ధ వెంకన్నను, అవనిగడ్డ నియోజకవర్గ ఇన్చార్జిగా విక్కుర్తి వెంకట శ్రీనివాసరావును నియమించింది. ఈ రెండు నియోజకవర్గాలు కీలకం కావడంతో.. ఎన్నికల ఫలితాలు వచ్చిన రెండు సంవత్సరాల తరువాత నియామకాలు చేపట్టింది.

**సుజనా చౌదరి ప్రాతినిధ్యం..**

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేశారు సీనియర్ నేత సుజనా చౌదరి. ఆయన విజయం సాధించారు. పూర్వాశ్రమంలో ఆయన తెలుగుదేశం పార్టీకి పనిచేశారు. అయితే అక్కడ సీనియర్ నేతగా బుద్ధ వెంకన్న ఉన్నారు. గతంలో ఆయన ఎమ్మెల్సీగా కూడా వ్యవహరించారు. ఇప్పుడు ఆయనను టిడిపి నియోజకవర్గ ఇన్చార్జిగా నియమించడం విశేషం. తెలుగుదేశం పార్టీలో ఉన్న సమయంలో రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు సుజనా చౌదరి. కేంద్ర మంత్రి కూడా అయ్యారు. అయితే 2019 ఎన్నికల్లో తెలుగుదేశం ఓడిపోయిన తర్వాత బిజెపిలో చేరారు. మొన్నటి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పొత్తు వెనుక కృషి కూడా చేశారు. అటువంటి సీనియర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో టిడిపి ఇన్చార్జిగా బుద్ధ వెంకన్నను నియమించడం విశేషం. వచ్చే ఎన్నికల్లో సుజనా చౌదరి ఎంపీగా పోటీ చేస్తారు అని భావిస్తున్న తరుణంలో వెంకన్న నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది.

**మండలి జనసేనలో చేరడంతో..**

మరోవైపు అవనిగడ్డ నియోజకవర్గ ఇన్చార్జిగా విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు నియామకం జరిగింది. రెండు సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పదవిని ఆయనతో భర్తీ చేశారు. 2024 ఎన్నికలకు ముందు నియోజకవర్గ ఇన్చార్జిగా ఉండేవారు మండలి బుద్ధ ప్రసాద్. కానీ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు జనసేనలో చేరి.. పొత్తులో భాగంగా ఆ సీటును దక్కించుకున్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. ఇటీవల ఎమ్మెల్యేగా ఉంటూ రాజకీయ ఇబ్బందులు పడుతున్నారు మండలి. వచ్చే ఎన్నికల్లో పోటీపై అనేక రకాల అనుమానాలు ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జిగా కొత్త వ్యక్తి రావడం విశేషం.

# చట్టసభల వయోపరిమితి 21 ఏళ్లకు తగ్గించాలి

సాగుతాయనిఅన్నారు. దేశంలో అధికారంలో వారు భాగస్వాములు కావాల్సి ఉందన్నారు. నీట్ పశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా దిల్లీలో ఆందోళన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కొన్ని దేశాల్లో అమల్లో ఉన్న విధంగా భారత్‌లోనూ 21 ఏళ్లకే ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం రావాలన్నారు. రాహుల్ ప్రధాని అయితే.. చట్ట సభలకు పోటీ చేసే వయసు 21 ఏళ్లకు తగ్గుతుందన్నారు. దేశంలో 30శాతం ఉన్న యువత చట్టసభలకు వెళ్లాలని ఆకాంక్షించారు. విద్యార్థుల పోరాటం ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే తొలగించాలని, వారి విజయాన్ని కాంగ్రెస్ ఖాతాలో వేసుకోబోమని స్పష్టం చేశారు. విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలంతా ఇదే నినాదాన్ని వినిపించాలని సూచించారు. విద్యార్థుల పోరాటం వల్లే కేంద్ర విద్యాశాఖ మంత్రి




రాజీనామా చేశారని, ఇది యువత సాధించిన విజయమని అన్నారు. విద్యార్థుల మోహాల్లో కనిపిస్తున్న ఆనందమే అసలైన విజయమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. చప్పన్ ఇంచ్ ఛాతీ అంటూ గొప్పలు చెప్పుకునే నాయకత్వం.. దేశ యువత ముందు ఓడిపోయిందని విమర్శించారు. అయితే విద్యార్థులపై నమోదైన కేసులు ఇంకా తొలగించలేదని, వెంటనే వాటిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నీట్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరామర్శించలేదని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకూ వారి తరఫున కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థుల పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కేంద్రం మెడలు వంచినందుకే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని పేర్కొన్నారు. మోదీ చరిష్మా తగ్గిందని, ఆయన చర్యలను ప్రపంచం ఖండించిందని వ్యాఖ్యానించారు. జెన్ జీ యువతకు చట్టసభల్లో ప్రాతినిథ్యం కల్పించాలని మహేష్ గౌడ్ అన్నారు. 21 ఏళ్లకే చట్టసభల్లోకి వచ్చే అవకాశం కల్పించేలా చట్టం తీసుకురావాలని, ఈ మార్పును తెలంగాణ నుంచే ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, జెన్ జీలు పాల్గొన్నారు.

# జనసేనకు కొత్త నాయకత్వం!

**క్రైమ్ మిర్రర్,, ఏపీ బ్యూరో:** ఏపీలో పార్టీ బలోపేతం పై ఫుల్ ఫోకస్ పెట్టారు జనసేన అధినేత పవన్ కళ్యాణ్. పార్టీ సమస్త గత నిర్మాణం పై దృష్టి కేంద్రీకరించారు. సుదీర్ఘకాలం ఒక రాజకీయ పార్టీగా మనుగడ సాగించేందుకు వీలుగా పార్టీని రూపొందించే పనిలో పడ్డారు. అత్యంత వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడంపై ఆయన దృష్టి సారించారు. మొన్నటి ఎన్నికల్లో జనసేన శత శాతం స్థానాలను సొంతం చేసుకుంది. అయినా సరే వచ్చే ఎన్నికల్లో రాజకీయంగా బలంగా ఎదిగేందుకు ఆ పార్టీ చేయని ప్రయత్నాలు అంటూ లేవు. అయితే పార్టీ అంటే సంస్థాగతంగా బలంగా ఉండాలని పవన్ భావిస్తున్నారు. అందుకే పార్టీ నాయకత్వాన్ని తయారు చేసే పనిలో పడ్డారు.

**దరఖాస్తుల స్వీకరణ..:** రాష్ట్రవ్యాప్తంగా వివిధ స్థాయిల్లో నాయకత్వ బాధ్యతల కోసం జనసైనికులు, వీర మహిళలు, క్రియాశీలక కార్యకర్తల నుంచి ఏకంగా 36 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన దరఖాస్తులను, అభ్యర్థుల అర్హతలను పవన్ కళ్యాణ్ స్వయంగా పర్యవేక్షిస్తుండడం పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంసంగా మారింది. పార్టీ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు 25 పార్లమెంటు నియోజక వర్గాల పరిధిలో పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి ఒక సీనియర్ పరిశీలకులు, స్థానిక నేతలు, సభ్యత్వ నమోదు సాదక్ లతో కూడిన 28 మంది సభ్యుల జంబో కమిటీలను నియమించారు. దాదాపు దశాబ్ద కాలంగా జండా మోసి, కష్టకాలంలో పార్టీ వెన్నంటి నడిచిన అసలైన వీర మహిళలు, సాధకులను గుర్తించి వారి వివరాలను, నివేదికలను సహకరించడమే ఈ కమిటీల ప్రధాన బాధ్యత.

**లోతైన రాజకీయ వ్యూహం..:** లోతైన రాజకీయ వ్యూహంతోనే పవన్ కళ్యాణ్ ఈ ప్రక్రియ చేపడుతున్నారు. సాధారణంగా ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత పాలనకే పరిమితం అవుతాయి. సంస్థాగత నిర్మాణాన్ని విస్మరిస్తుంటాయి. గతంలో పసలేని కమిటీలు, సరైన నిర్మాణం లేకపోవడం వల్ల ఎదురైన వైఫల్యాలను పునరావృతం కానివ్వకుండా జాగ్రత్త పడుతున్నారు పవన్ కళ్యాణ్. పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించిన కార్యకర్తల్లో అసంతృప్తి చెలరేగకుండా, వారికి పార్టీ, అనుబంధ పదవుల్లో తగిన గుర్తింపు ఇవ్వడం ద్వారా ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని నిర్మించడమే పవన్ కళ్యాణ్ ప్రాథమిక లక్ష్యంగా కనిపిస్తోంది.. అవకాశవాద నేతల చొరబాటు జనసేనలోకి లేకుండా చేయడమే ముఖ్య ఉద్దేశంగా కనిపిస్తోంది.



# జెన్ జీ 'ధర్మం' గెలిచింది!

జంతర్ మంతర్ వద్ద చోటు చేసుకున్న పరిణామాలు, దేశవ్యాప్తంగా చెలరేగిన ఆందోళనల దృష్ట్యా అసమ్మతిని, దేశ వ్యతిరేక శక్తులు ఈ పరిస్థితిని

దుర్వినియోగం చేయకూడదని, విద్యార్థులు చట్టపరమైన చిక్కుల్లో చిక్కుకోకుండా తన భవిష్యత్తుపై దృష్టి పెట్టాలనే ఉద్దేశంతోనే తన పదవి నుంచి వైదొలుగుతున్నట్లు ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. నీట్ వ్యవహారంలో జరిగిన అక్రమాలపై తొలి రోజు నుంచి తాను బాధ్యత వహించానని.. ఏ ఒక్క ప్రతిభావంతుడైన విద్యార్థికి అన్యాయం జరగకూడదనే సంకల్పంతో సిబిఐ విచారణ, రీ టెస్ట్ నిర్ణయాలను తీసుకున్నానని చెప్పుకొచ్చారు. దేశ యువత అయోమయంలో, గందరగోళంలో చిక్కుకోకూడదన్న ఏకైక లక్ష్యంతో తన రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.



**భారీ ఆందోళనలు..**

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత .. జెన్ జి తిరుగుబాటు ప్రారంభం అయింది. పరీక్ష కేంద్రాల ముందు, సోషల్ మీడియా హాష్ ట్యాగులలో కాకుండా.. ప్రభుత్వ నిరంకుశ వైఖరిని, విద్యాశాఖ అలసత్వాన్ని నేరుగా ప్రశ్నిస్తూ యువత జరిపిన సమరానికి ఈ రాజీనామా ఒక పెద్ద విజయం. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వార్త రాగానే భారత యువతరంలో సరికొత్త నినాదం మొదలైంది. జెన్ జి గొంతుకను, వారి ఆక్రోసాన్ని తేలిగ్గా తీసుకుంటే ఏ ప్రభుత్వానికైనా ఇదే గతి పడుతుందని మోడీకి ఇప్పటికైనా అర్థమై ఉంటుందని విపక్షాలు భావిస్తున్నాయి.. అయితే అప్రతిహస విజయంతో దూసుకు వెళ్తున్న ఎన్డీఏ, భారతీయ జనతా పార్టీకి ఇది గొడ్డలి పెట్టు లాంటిది. దీంతో మరింత దూకుడు పెంచాలని విపక్షాలు భావిస్తాయి. ఇది ఒక ప్రమాద ఘంటిక అని భావించాలి.

## నీట్ రద్దుతో విద్యార్థుల్లో పెరిగిన పట్టుదల

**మరింత మెరుగైన ప్రతిభ కోసం కష్టపడ్డారు**

**ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్య**

న్యూఢిల్లీ,జూలై:దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న పరీక్షల పేపర్ లీకేజీల వివాదంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భిన్నంగా స్పందించారు. పేపర్ లీక్‌లు జరిగినప్పుడు మొదట్లో విద్యార్థులు తీవ్రంగా బాధపడినప్పటికీ, ఆ తర్వాత ఆ సవాలును స్వీకరించి మరింత బాగా చదివి ప్రతిభను మెరుగుపరుచుకున్నారని ఆమె తెలిపారు. ముందు బాధనిపించింది.. తర్వాత దాన్నే అవకాశంగా మలచుకుని మెరుగ్గా రాశామని పలువురు విద్యార్థులు చెబుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలపై ఓ వార్తా సంస్థకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. పరీక్షల పవిత్రతను దెబ్బతీసిన వారిపై సత్వర చర్యలు తీసుకోవడానికి ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా స్పందించారని మంత్రి చెప్పారు. నిందితుల అరెస్టులు, సకాలంలో మళ్లీ పరీక్షలు నిర్వహించడం, ఫలితాలను విడుదల చేయడం ద్వారా విద్యార్థులు తమ ఉన్నత విద్య వైపు అడుగులు వేయగలుగుతున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ సున్నితమైన అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ చర్యల వల్ల ప్రతిపక్షాల విమర్శలకు విలువే లేకుండా పోయింది. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు, పేపర్లను అమ్మిన, కొనుగోలు చేసిన నేరస్తుల అరెస్టులు శరవేగంగా జరుగుతున్నాయి' .

# కోమటిరెడ్డి బ్రదర్స్‌పై తిరుగుబాటు!

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యంగా కోమటిరెడ్డి బ్రదర్స్ పై సాటి కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేలు తిరుగుబాటు బాగుట ఎగరవేశారు. కోమటిరెడ్డి బ్రదర్స్ పై నిప్పులు చెరిగారు. మంత్రిగా ఉన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి లపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. తన నియోజకవర్గం తుంగతుర్తిలో ప్రోటోకాల్ కు విరుద్ధంగా వ్యవహరిస్తున్న మంత్రి వెంకటరెడ్డి తో పాటు రాజగోపాల్ రెడ్డి పై హై కమాండ్ కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. దీంతో నల్గొండ కాంగ్రెస్ పార్టీలో ఒక్కసారిగా కలకలం రేగింది.

**అప్పట్లో దయాకర్ ను అడ్డుకునేందుకు..**

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి టికెట్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత ఆప్తుడైన అద్దంకి దయాకర్ కు ఇచ్చేందుకు నిర్ణయం జరిగింది. అయితే అప్పటికప్పుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యూహం పన్నారు. భారత రాష్ట్ర సమితిలో ఉన్న మందుల సామేలును కాంగ్రెస్ లోకి తీసుకొచ్చారు. పార్టీ టికెట్ ఇప్పించారు. తన ప్రాబల్యాన్ని తుంగతుర్తి నియోజకవర్గంలో నిలబెట్టుకునేందుకు అప్పట్లో కోమటిరెడ్డి వెంకటరెడ్డి అలా చేశారు. అయితే ఇప్పుడు అదే కోమటిరెడ్డి వెంకటరెడ్డి పెత్తనాన్ని ప్రశ్నిస్తూ మందుల సామేలు ఎదురు తిరగడం కాంగ్రెస్ పార్టీ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది.

**ప్రోటోకాల్ రగడ..**

తుంగతుర్తి నియోజకవర్గ పర్యటన విషయంలో ప్రోటోకాల్ పాటించడం లేదు. స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలును లెక్కచేయడం లేదు. తానే టిక్కెట్ ఇప్పించాను కదా అనే అభిప్రాయం కోమటిరెడ్డి వెంకటరెడ్డి లో ఉంది. అయితే ఆ నియోజకవర్గంలో కోమటిరెడ్డి బ్రదర్స్ పర్యటనలు చేయడం.. పార్టీ కార్యవర్గాల నియామకాల్లో ఏకపక్షంగా వ్యవహరించడం వంటి కారణంగా మందుల సామేలు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. మీ దయాదాక్షిన్యాలపై గెలవలేదు. 50వేల భారీ మెజారిటీతో గెలిచాను అంటూ సామేలు హాట్ కామెంట్స్ చేశారు. కోమటిరెడ్డి బ్రదర్స్ విషయంలో తగ్గేదిలే అంటూ మందుల సామేలు తేల్చి చెప్పారు.

**బలపడుతున్న వ్యతిరేకవర్గం..**

అయితే ఇప్పుడు నల్గొండ జిల్లాలో అధికార కాంగ్రెస్ పార్టీలో సామాజిక, రాజకీయ కోణాలను సంతరించుకుంటుంది. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ఏకమై కోమటిరెడ్డి బ్రదర్స్ పై విలుచుకుపడుతున్నారు. పార్టీ హై కమాండ్కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడుతున్నారు. జిల్లాలో ఎస్సీలతో పాటు బీసీ ఎమ్మెల్యేలు అంటే చిన్నచూపు చూస్తున్నారని.. నల్గొండ అంటే తమ జాగీరుగా భావిస్తున్నారని వారు ఆగ్రహంగా ఉన్నారు. అయితే కేవలం రేవంత్ రెడ్డి వర్గాన్ని కట్టడి చేసేందుకు కోమటిరెడ్డి బ్రదర్స్ తెచ్చుకున్న నేతలు ఇప్పుడు తిరుగుబాటు చేస్తున్నారు. వీరి వెనుక కాంగ్రెస్ పెద్దల హస్తం ఉందన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

# ఏపీలో ఓట్లు గల్లంతు!

ఈ స్థాయిలో ఓట్లు గల్లంతు అయితే మాత్రం ప్రధాన రాజకీయ పార్టీలకు ఇబ్బందికరమే. అయితే గత వైసిపి హయాంలో ఇలా ఎక్కువగా ఓట్లు నమోదు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో... కచ్చితంగా ఇది కూటమికి ప్రయోజనం చేకూర్చే అంశమే.

**ముసాయిదా ఓటరు జాబితా సిద్ధం..**

సుదీర్ఘకాలం ఈ సర్ ప్రక్రియ కొనసాగింది. ఈ నెలాఖరున అంటే జూలై జూలై 31న ముసాయిదా ఓటర్ జాబితాను ఎన్నికల సంఘం అధికారికంగా విడుదల చేయనుంది. అనంతరం అభ్యంతరాలు, చేర్పులు మార్పులకు అవకాశం కల్పించనుంది. విచారణలు ముగించిన తర్వాత అక్టోబర్ మూడున తుది ఓటర్ జాబితాను ప్రకటిస్తారు. తొలగింపునకు గురవుతున్న వాటిలో అత్యధికంగా రెండు చోట్ల ఉన్న వారిని, మరణించిన వారిని, జీవనోపాధి కోసం ఇతర రాష్ట్రాలు, విదేశాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లే ప్రధానంగా ఉన్నాయి. ప్రారంభంలో బోగస్ ఓట్ల నమోదు, తొలగింపులపై రాజకీయ పార్టీల మధ్య తీవ్ర స్థాయిలో ఆరోపణలు, ప్రత్యారోపణలు నడిచాయి. కానీ ఇప్పుడు వైసీపీ నుంచి కూడా ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కావడం లేదు. వాస్తవానికి ఈ సర్ ప్రక్రియలో అధికార కూటమితో పాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా సీరియస్ గా తీసుకుని క్షేత్రస్థాయిలో పని చేశాయి.



**పార్టీలు ఫుల్ ఫోకస్..**

అయితే ఏపీవ్యాప్తంగా ఈ స్థాయిలో లెక్కలోకి రాని ఓట్లు రావడం ఆందోళన కలిగిస్తోంది. రాజకీయ పార్టీల సమర్థవంతమైన పర్యవేక్షణ, బిఎల్వోల కఠిన నిబంధనల కారణంగా.. కేవలం నిర్లక్ష్యం వల్ల ఓటు హక్కు కోల్పోతున్న నిజమైన ఓటర్ల సంఖ్య చాలా తక్కువ ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. జూలై 31న వెలువడే ముసాయిదా ఓటరు జాబితా ఆధారంగా.. ఓటర్లు తమ పేర్లు ఉన్నాయో లేదు సరి చేసుకునే వీలు ఉంటుంది. పొరపాటున ఎవరి పేరైనా తొలగిపోతే.. అక్టోబర్ 30న తుది జాబితా వచ్చేలోపు ఫారం 6 ద్వారా మళ్ళీ దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా డబ్బులు ఎంట్రీ తో పాటు బోగస్ ఓట్లకు చెక్ పెడుతూ ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రక్షాళన.. పారదర్శకమైన ఎన్నికలకు బలమైన బాటలు వేస్తుందని నమ్మకంగా చెప్పవచ్చు. కానీ భారీ స్థాయిలో ఓట్లు గల్లంతు కావడం ఖాయమని తెలుస్తుండడం రాజకీయ పార్టీల్లో ప్రకంపనలు రేపుతోంది.

## ఇంద్రకీలాద్రిపై వైభవంగా ఆషాఢ ఉత్సవాలు

**27, 28, 29 తేదీల్లో శాకంబరీ ఉత్సవాలకు సన్నాహాలు**

**7 టన్నుల కూరగాయలను దేవస్థానానికి అందజేసిన వ్యాపారులు**

విజయవాడ,జులై25: ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయంలో ఆషాడ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న శాకంబరీ ఉత్సవాలకు దేవస్థానం సన్నాహాలను ముమ్మరం చేసింది. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శ్రీ శాకంబరీదేవి అలంకారంలో ఆకు కూరలు, కూరగాయలు, పండ్లతో అలంకరించబడిన ప్రకృతి మాత స్వరూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవాల తొలి రోజు అలంకరణ కోసం శ్రీ దుర్గా మల్లేశ్వర హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వ్యాపారులు, దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు బడేటి ధర్మారావు ఆధ్వర్యంలో తొలి విడతగా 7 టన్నుల కూరగాయలను దేవస్థానానికి అందజేశారు. శనివారం సాయంత్రం మహామండపం ఆరో అంతస్తులో దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ అమ్మవారికి కూరగాయలను సమర్పించగా, ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాకంబరీ అలంకరణ కోసం కూరగాయల దండల తయారీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈవో వి.కె. శీనా నాయక్ మాట్లాడుతూ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని తాడేపల్లిగూడెం, తణుకు, మడికి, సిద్ధాంతం, ఏలూరు ప్రాంతాలతో పాటు గుంటూరు జిల్లా జాగర్లమూడి, తెనాలి, యడ్లపల్లి, నారాకోడూరు, గుంటూరు, కృష్ణా జిల్లా నూజివీడు, చినఓగిరాల, పెదఓగిరాల ప్రాంతాల రైతుల నుంచి వివిధ రకాల కూరగాయలను సేకరించి దేవస్థానం బస్సుల ద్వారా ఇంద్రకీలాద్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది నిర్వహించే శాకంబరీ ఉత్సవాలు ఇంద్రకీలాద్రిలో అత్యంత వైభవంగా జరుగుతాయని, ఈ మూడు రోజుల పాటు వేలాది మంది భక్తులు అమ్మవారిని ప్రకృతి మాత స్వరూపంలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారని దేవస్థానం అధికారులు తెలిపారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ యువశక్తి విజయం

**బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**

నిజామాబాద్:కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ యువత మొక్కవోని పోరాట పటిమతో సాధించిన ప్రజాస్వామ్య విజయమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత రాజకీయాలకు అతీతంగా తమ భవిష్యత్తు కోసం, విద్యా వ్యవస్థలో పారదర్శకత కోసం చేపట్టిన ఉద్యమం చివరకు ఫలితాన్ని ఇచ్చిందన్నారు. పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలు, విద్యార్థుల భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితికి వ్యతిరేకంగా యువత శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా చేసిన పోరాటానికి కేంద్ర ప్రభుత్వం చివరకు స్పందించి దిగిరాక తప్పలేదన్నారు. ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం లాఠీచార్జీలు, భాష్పవాయు గోళాలు, నిర్బంధాలను ఆశ్రయించినప్పటికీ, దేశ యువత ఏమాత్రం వెనక్కి తగ్గకుండా అపారమైన ధైర్యంతో తమ ఉద్యమాన్ని కొనసాగించిందన్నారు. 'అధికారం ఎంత బలంగా కనిపించినా, చైతన్య వంతమైన యువత సంకల్పం ముందు తలవంచక తప్పదనే విషయాన్ని ఈ ఉద్యమం మరోసారి నిరూపించింది' అని అన్నారు. యువత ఐక్యపోరాటం ముందు ప్రభుత్వం దిగివచ్చే పరిస్థితి ఏర్పడిందని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఆ ప్రజాస్వామ్య పోరాటానికి లభించిన నైతిక విజయమని పేర్కొన్నారు. కానొక సందర్బం లో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నట్టు ?'దేశం కోసం అవసరం వచ్చినప్పుడు ఇండియా రియాక్ట్ అవుతుంది'? అనే మాటలను ఎమ్మెల్యే గుర్తు చేశారు. నేడు దేశ యువత అదే విషయాన్ని మరోసారి సాక్షాత్కరించిందన్నారు. 'యువత ప్రశ్నించడం ప్రారంభిస్తే అధికార వ్యవస్థలు జవాబుదారీతనం వహించక తప్పదు. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకే అంతిమ తీర్పు' అని అన్నారు. చదువుకున్న యువత కేవలం ఉద్యోగాల కోసం మాత్రమే కాదు... దేశ భవిష్యత్తు కోసం కూడా పోరాడుతుందని ఈ ఉద్యమం స్పష్టం చేసింది. జ్ఞానం, చైతన్యం, ఐక్యత కలిసొస్తే ఏ అహంకారమైనా కూలిపోవాల్సిందే' అని వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, విద్యా వ్యవస్థ విశ్వసనీయత, పరీక్షల పారదర్శకత వంటి అంశాల్లో కేంద్ర ప్రభుత్వం సమగ్ర సంస్కరణలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. 'సమస్యలు మొదలైన వెంటనే బాధ్యతాయుతంగా స్పందించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. విద్యార్థుల ఆవేదనను నిర్లక్ష్యం చేయడం వల్లే ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి' అని విమర్శించారు. ఇకపై దేశంలో ఏ విద్యార్థి కూడా పరీక్షల అవకతవకల కారణంగా నష్టపోకుండా కఠినమైన, పారదర్శకమైన పరీక్షల వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. 'ఇది ఒక వ్యక్తి రాజీనామాతో ముగిసే అంశం కాదు. దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థుల్లో సంపూర్ణ విశ్వాసం నెలకొనే వరకు సంస్కరణలు కొనసాగాలి. అదే ఈ ఉద్యమం ఇచ్చిన అసలైన సందేశం' అని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ÷శిశ యువతకు ఈ విజయం ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతుందని, ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా పోరాడితే మార్పు సాధ్యమేననే నమ్మకాన్ని ఈ ఉద్యమం దేశ ప్రజల్లో మరింత బలపరిచిందని ఆయన పేర్కొన్నారు

## ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అప్పగింత

**ధర్మేంద్రప్రధాన్ రాజీనామా ఆమోదం**

న్యూఢిల్లీ: ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం విద్యాశాఖ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వం మరో మంత్రి ప్రహ్లాద్ జోషికి అప్పగించింది. ప్రస్తుతం కన్స్యూమర్ ఎఫైర్స్ శాఖ మంత్రిగా ఉన్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రధాని సలహా మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖను కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇక ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కూడా రాష్ట్రపతి ఆమోదించారు. కర్ణాటకలోని ధార్వాడ్ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రహ్లాద్ జోషి.. ఆహార, ప్రజాసరఫరా వ్యవహారాలు, పునరుత్పాదక ఇంధన శాఖ వ్యవహారాలను కూడా పర్యవేక్షిస్తున్నారు. భారత్ చొరవతో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్‌కు ప్రెసిడెంట్‌గా ఉన్నారు.

## గుజరాత్‌లో వరదల బీభత్సం

**వల్సాద్‌లో నీట మునిగిన గృహసముదాయాలు**

గాంధీనగర్: గుజరాత్‌లోని వల్సాద్‌లో భారీ వర్షాలకు నివాస సముదాయాలు నీట మునిగాయి. ఓ వ్యక్తి తన ఇంటి బయట వరద నీటిలో నిలబడి ఉన్న వీడియో వైరల్ అయింది. ఇక్కడ పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో ఆ వీడియో చూస్తే తెలుస్తోంది. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా వీధులు, రోడ్లు పూర్తిగా నీట మునిగిపోవడంతో, సదరు యువకుడు తన ఇంటి బయట మెడలోతు వరద నీటిలో నిలబడి పరిస్థితిని వివరించాడు. పార్క్ చేసిన వాహనాలు, ప్రహరీలు, భవనాల పైభాగాలు మాత్రమే బయటకు కనిపిస్తున్న ఈ దృశ్యాలు వరద తీవ్రతను స్పష్టంగా చూపిస్తున్నాయి. ఈ వీడియోలో సదరు వ్యక్తి మునిగిపోయే స్థాయిలో నీరు చేరడం చూసి నెటిజన్లు షాక్ అవుతున్నారు. వీధులు, ఖాళీ స్థలాల మధ్య తేడా తెలియకుండా అంతా జలమయం కావడంతో అక్కడి నివాసితుల దైనందిన జీవితం పూర్తిగా స్తంభించిపోయింది. పట్టణాల్లో అరకొరగా ఉన్న మురుగునీటి పారుదల వ్యవస్థలు, ఈ తరహా ముంపునకు ప్రధాన కారణమని ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ దృశ్యాలు చూసిన పలువురు నెటిజన్లు శివమ్ సింగ్, ఇతర నివాసితులు సురక్షితంగా ఇళ్లలోనే ఉండాలని కోరారు. మరోవైపు అధికారులు, రెస్క్యూ టీమ్ ఇప్పటికే పలువురిని సురక్షిత ప్రదేశాలకు తరలించినట్లు సమాచారం.

## జిల్లాలో విష జ్వరాలకు ఇద్దరు చిన్నారుల మృతి

జగిత్యాల: జిల్లాలోని పొరండ్ల గ్రామంలో విషజ్వరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. గ్రామంలో విషజ్వరాల బారిన పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. విషజ్వరంతో బాధపడుతున్న హరిస్మిత(6) అనే చిన్నారి.. చికిత్స పొందుతూ మృతి చెందింది. శుక్రవారం వరుణ్ తేజ(6) అనే చిన్నారి కూడా విషజ్వరం బారిన పడి ప్రాణాలు కోల్పోయాడు.

విద్యార్థుల ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు కాంగ్రెస్, ఆప్ పార్టీలు నానా తంటాలు పడుతున్నాయి. తమ కంట్రోల్‌లో తీసుకునేందుకు రాహుల్ నానా యాతన పడుతున్నారు. తానే ముందుండి ఇదంతా నడిపిస్తున్న ట్లుగా వ్యవహరించారు. ప్రధాని మోడీ నివాసం ముందు ఆకస్మిక ధర్నాకు దిగడం, రాష్ట్రాల్లో మద్దతుగా కాంగ్రెస్ ఆందోళనలకు దిగడం చూస్తుంటే కాంగ్రెస్ రాజకీయ లబ్ది పొందేందుకు ఎత్తులు వేస్తోందని అర్థం అవుతోంది. అభిజిత్ దీప్కే వెనకాల కాంగ్రెస్ ఉందా లేదా అన్నది తెలియదు. ఒకవేళ ఉంటే విద్యార్థులు వెంటనే కాంగ్రెస్‌ను పక్కన పెట్టాలి. ఎందుకంటే విద్యార్థుల ఉద్యమం పక్కదారి పట్టే అవకాశం ఉంది. విద్యార్థులు ఉద్యమించడం ద్వారా ఒక్క నీట్ సమస్య కాకుండా అనేక సమస్యలు, ముఖ్యంగా దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడే ఛాన్స్ ఉంటుంది. కాంగ్రెస్‌ను దగ్గరకు రానీయనంతవరకు అభిజిత్ దీప్కే ఉద్యమానికి ఢోకా ఉండదు. ఎందుకంటే నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. యువత కూడా జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసనకు రావడంలో నిజాయితీ ఉంది. సోమవారం పార్లమెంట్ మార్చ్ సందర్భంగా పోలీసులు, నిరసనకారులకు మధ్య హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో రెండు వర్గాలు గాయపడ్డాయి. ఈ ఉద్యమంలో ప్రధాన ఎజెండా పేపర్ లీకుల నుంచి విషయం తప్పుదారి పడుతున్నట్లు కనిపిస్తోంది. ఉద్యమంలో యువత పాల్గొంటున్నప్పటికీ, వారితో పాటు కొన్ని మత శక్తులు కూడా ప్రవేశించాయని స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా జంతర్ మంతర్ వద్ద అసలైన ఎజెండా పక్కకు పోయి రామమందిరం, హిందూ దేవతల్ని తిట్టడం, జర్నలిస్టులపై దాడులు, భారత సైన్యంపై విద్వేష వ్యాఖ్యలు, జిహాద్ నినాదాలు వినిపించడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని శక్తులు ఈ ఉద్యమాన్ని హైజాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో విద్యార్థి ఉద్యమం మత ఉద్యమంగా మారుతుందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. మరోవైపు, నిహాంగ్ సిక్కులు కత్తులు, కిర్పాన్లు, ఈటెలతో కనిపించడం మరింత వివాదాస్పదమైంది. వీటిని ఊపుతూ ప్రదర్శనలు చేయడంపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పలువురు మేధావులు కూడా ఈ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరైన సమన్వయం లేకపోతే ప్రశాంతమైన ఉద్యమం బయటి శక్తుల ప్రయోజనాలకు ఉపయోగించే ప్రమాదం ఉందని అభిప్రాయపడుతున్నారు. బుధవారం రాత్రి యూట్యూబర్లపై దాడి, నిరసనకారులు-నిహాంగ్ సిక్కులకు మధ్య ఘర్షణకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుతుండటం మహిళల భద్రతకు ప్రమాదంగా మారింది. ఒక యువతిపై లైంగిక వేధింపులకు ప్రయత్నిస్తున్న వీడియో బయటకు రావడం మరింత ఆందోళనకు గురిచేసింది. పేపర్ లీక్ అంశాలతో పాటు మతం, ప్రాంతీయ ఉద్యమాలు, రాజకీయ అంశాలు ప్రస్తావనకు వస్తుండటం చూస్తే ఉద్యమం అసలు లక్ష్యం బలహీనపడుతుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై గత కొద్ది రోజులుగా జంతర్‌మంతర్ దగ్గర విద్యార్థులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు.

## కాక్రోచ్ ఉద్యమాన్ని హైజాక్ చేసే యత్నాలు ?

చలో పార్లమెంట్ ముట్టడి సందర్భంగా విద్యార్థులపై పోలీసులు అమానుషంగా లాఠీఛార్జ్ నిర్వహించారు. దీంతో చాలా మంది బాలికలకు తీవ్ర గాయాలయ్యాయి. పలువురి పరిస్థితి విషమంగా కూడా మారింది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. దీంతో దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థులకు మద్దతు లభించింది. సినీ, క్రికెటర్లు, విపక్ష రాజకీయ నాయకుల నుంచి సంపూర్ణ మద్దతు లభించింది. ఈ క్రమంలో తాజాగా జంతర్‌మంతర్ దగ్గర కిలోమీటర్ దూరంలో ఇంటర్నెట్, మొబైల్ సేవలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరాకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మరోవైపు రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు సంతాపంగా గాంధీ స్మృతి వనం దగ్గర నివాళులర్పించారు. విద్యార్థులకు ఇండియా కూటమి అండగా ఉంటుందని రాహుల్ గాంధీ ప్రకటించారు. ఇదంతా కూడా కాంగ్రెస్ ఉద్యమాన్ని తన గుప్పిట్లోకి తీసుకుని పోయే యత్నంగా గోచరిస్తున్నది. గత రెండు నెలలుగా పెద్దగా పట్టించుకోని కాంగ్రెస్ అకస్మాత్తుగా ఇప్పుడు ముందువరసలోకి రావడానికి యత్నిస్తోంది. బిజెపి కూడా ఇంతకాలం తాత్సారం చేస్తూ వచ్చింది. పరీక్షలో అక్రమాల ఆరోపణలు, పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక పరిపాలనా మార్పులు చేపట్టింది. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా ఉన్న వినీత్ జోషిని ఆ పదవి నుంచి తప్పిస్తూ, ఆయన స్థానంలో నరేశ్ పాల్ గంగ్వార్ ను నియమించింది. ఈ మేరకు గురువారం అర్ధరాత్రి కేంద్ర ప్రభుత్వం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. రాజస్థాన్ విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందిన గంగ్వార్, కేంద్రంతో పాటు రాజస్థాన్ ప్రభుత్వంలో కూడా పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా కూడా సేవలందించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పేపర్ లీక్‌కు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సజిపి ప్రధాన డిమాండ్‌గా పెట్టుకుంది. కానీ కేంద్రం ఈ డిమాండ్‌ను పక్కన పెట్టింది. ప్రముఖ సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ ఈ నిరసనలో పాల్గొని నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. దీంతో ఉద్యమం మరింత ఉధృతమైంది. జూలై 20న 'చలో పార్లమెంట్' కార్యక్రమానికి పిలుపునివ్వగా, నిరసనకారులు, ఢిల్లీ పోలీసుల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల అనంతరం కేంద్ర ప్రభుత్వం పలుమార్లు సిజిపి ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించింది. అయితే, కేంద్ర మంత్రులే జంతర్ మంతర్ లేదా నిరసన ప్రాంతానికి సమీపంలోని వేదికకు రావాలని కాక్రోచ్ పార్టీ స్పష్టం చేసింది. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వరుస చర్యలు తీసుకుంటుండగా, రానున్న రోజుల్లో ఈ అంశంపై మరిన్ని కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఉద్యమం పక్కదాని పట్టకుండా, రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అభిజిత్ దీప్కేతో పాటు, ఆయన అనుచరులపై ఉంది.

సమకాలీన సమాజంలో ప్రతి ఒక్కరినీ వేధించే ఒక నిరంతర ప్రశ్న, నిత్య మానసిక సంఘర్షణ ఏమిటంటే నేను నా శక్తినంతా ధారపోసి కష్టపడ్డాను, అహోరాత్రులు శ్రమించాను, అయినా ఆశించిన ఫలితం ఎందుకు దక్కలేదు? ఈ ప్రశ్న అత్యంత విశ్వజనీనమైనది. విద్యా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని పగలు రేయి శ్రమించే విద్యార్థి ఆశించిన ర్యాంకు సాధించలేకపోవడం, ఎన్నో వ్యూహాత్మక ప్రణాళికలతో వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించాలని చూసిన పారిశ్రామికవేత్త నష్టాల ఊబిలో కూరుకుపోవడం, ఎంతో ప్రేమానురాగాలతో, క్రమశిక్షణతో పిల్లలను పెంచిన తల్లిదండ్రులకు వారి సంతానం భిన్నమైన మార్గాల్లో ప్రయాణించి తీవ్ర నిరాశ పరచడం నిత్యం మనం చూస్తూనే ఉన్నాం.



ఈ సామాజిక పరిణామాలు, వైఫల్యాలు మానవ మేధస్సుకు ఒకే ఒక చిక్కుముడిని విసురుతున్నాయి. కర్మ చేసే స్వేచ్ఛ, హక్కు మానవుడికి సంపూర్ణంగా ఉన్నప్పుడు, ఆ కర్మ ద్వారా లభించే అంతిమ ఫలితంపై అతనికి నియంత్రణ లేదా అధికారం ఎందుకు ఉండదు? ఈ ప్రశ్న ఆధారంగానే భారతీయ తాత్విక చింతనలో కర్మ సిద్ధాంతం ఆవిర్భవించింది. దీనిని నేటి సామాజికాంశాలతో ముడిపెట్టి సమగ్రంగా విశ్లేషించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

# ఫలితంపై ఆత్రుత ఎందుకు?
# ప్రక్రియే పరమార్థం కావాలి!

పురాతన కాలం నాటి మహాభారత యుద్ధ రంగంలో వికల మనస్కుడైన అర్జునుడికి శ్రీకృష్ణ పరమాత్మ బోధించిన పరమ పవిత్రమైన, ఆచరణాత్మకమైన సూత్రం "కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన". ఈ శ్లోకం కేవలం ఒక మతపరమైన ఆచార గ్రంథానికి పరిమితమైనది కాదు. ఇది మానవ ఉనికిని, ప్రవృత్తిని విశ్లేషించే ఒక లోతైన మనస్తత్వ శాస్త్ర విశ్లేషణ అనడంలో ఎలాంటి సందేహం లేదు. కర్తవ్యాన్ని నిర్వహించడంలో మాత్రమే నీకు సర్వాధికారాలు ఉన్నాయి తప్ప, దాని ద్వారా సిద్ధించే ఫలితాలపై నీకు ఎటువంటి యాజమాన్య హక్కులు లేవని ఈ విశ్వజనీన సూత్రం ఘోషిస్తోంది. ఎందుకంటే, భౌతిక ప్రపంచంలో ఏ ఒక్క పరిణామం లేదా ఫలితం కూడా కేవలం ఒకే ఒక వ్యక్తి చేసిన ప్రయత్నం వల్ల మాత్రమే సాకారం కాదు. అది అనేక అదృశ్య, దృశ్య శక్తుల, విభిన్న కారణాల సమ్మేళనం. శాస్త్రీయ దృక్పథంతో ఆలోచిస్తే, కర్మ ఫలితం మన చేతుల్లో ఎందుకు ఉండదో స్పష్టంగా అర్థమవుతుంది. ఇందుకు గల కారణాలను పత్రికా విశ్లేషణాత్మక కోణంలో నాలుగు ప్రధాన విభాగాలుగా వర్గీకరించవచ్చు. మొదటిది కాల గమనం మరియు ప్రకృతి శక్తుల ప్రభావం మానవుడు ఒక విత్తనాన్ని నాటగలడు, దానికి అవసరమైన పోషకాలను అందించగలడు. కానీ ఆ విత్తనం ఎప్పుడు మొలకెత్తాలి, వాతావరణం ఎలా ఉండాలి, భూమి ఏ మేరకు సహకరించాలి అనేది ప్రకృతి నియమాలపై ఆధారపడి ఉంటుంది. ఒక నిబద్ధత కలిగిన రైతు తన సర్వశక్తులూ ఒడ్డి పొలాన్ని దున్ని, పంట వేస్తాడు. కానీ అకాల వర్షాలు, తుఫానులు, లేదా తీవ్రమైన కరవు పరిస్థితులు సంభవించినప్పుడు ఆ పంట పూర్తిగా నాశనమవుతుంది. ఈ విధమైన ప్రకృతి వైపరీత్యాలు మానవ శ్రమను బూడిదలో పోసిన పన్నీరుగా మారుస్తాయి. ఇక్కడ రైతు అంకితభావంలో కానీ, శ్రమలో కానీ ఎటువంటి లోపం లేదు. అయినప్పటికీ ప్రతికూల ప్రకృతి శక్తుల కారణంగా ఫలితం అతనికి దక్కకుండా పోయింది. రెండవది పరస్పర ఆధారిత సామాజిక చర్యలు ఆధునిక సమాజంలో ఏ వ్యక్తి కూడా ఒంటరిగా జీవించలేడు. మన ప్రతి కార్యకలాపం ఇతరుల నిర్ణయాలతో ముడిపడి ఉంటుంది. ఉదాహరణకు, ఒక నిరుద్యోగి ఒక ఉన్నత ఉద్యోగం కోసం రాతపరీక్షల్లో, ఇంటర్వ్యూలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచవచ్చు. కానీ అంతిమంగా ఆ ఉద్యోగాన్ని ఎంపిక చేసే అధికారం ఉన్నతాధికారి లేదా ఇంటర్వ్యూ బోర్డు నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. వారి మానసిక స్థితి, వారి ప్రాధాన్యతలు, సంస్థ యొక్క అంతర్గత విధానాలు ఫలితాన్ని శాసిస్తాయి. అంటే మన వ్యక్తిగత కర్మ ఒంటరిగా ఫలితాన్ని నిర్ణయించలేదు, అది సమాజంలోని అనేక ఇతర కర్మలతో ముడిపడి ఉంటుంది. మూడవది విశ్వజనీన కారణ కార్య సంబంధాలు (కాజాలిటీ) భౌతిక ప్రపంచంలో ప్రతి చిన్న మార్పు వెనుక లెక్కలేనన్ని అదృశ్య కారణాలు దాగి ఉంటాయి. సాధారణంగా మానవులు తాము చేసే ప్రత్యక్ష ప్రయత్నాలను మాత్రమే గమనిస్తారు. కానీ ఆ ఫలితాన్ని ప్రభావితం చేసే ఆర్థిక కుంగుబాట్లు, ప్రపంచ రాజకీయ పరిణామాలు, సాంకేతిక విప్లవాలు, యాదృచ్ఛిక సంఘటనలు అనేకం ఉంటాయి. ఈ బాహ్య శక్తులన్నింటినీ ఒక సామాన్య మానవుడు నియంత్రించడం కేవలం అసాధ్యం. నాలుగవది సంచిత కర్మల ప్రభావం మరియు సంస్కారాలు ప్రాచీన భారతీయ తత్వశాస్త్రం ప్రకారం, ప్రస్తుత వర్తమాన కాలంలో మనం అనుభవించే సుఖదుఃఖాలు కేవలం ప్రస్తుత కర్మల వల్లనే సంభవించవు. గతంలో చేసిన పుణ్యపాపాలు లేదా సంచిత కర్మల యొక్క సారాంశం కూడా వర్తమాన ఫలితాలను శాసిస్తుంది. ఇది నమ్మకానికి సంబంధించిన ఆధ్యాత్మిక అంశంగా కనిపించినప్పటికీ, ఒక నిఖార్సయిన సత్యం మాత్రం స్పష్టమవుతోంది. ఏ ఒక్క సంఘటన వెనుక కూడా తక్షణ కారణం మాత్రమే ఉండదు, దానికి సుదీర్ఘమైన నేపథ్యం ఉంటుంది. ఈ క్లిష్టమైన పరిస్థితుల్లోనే గీత బోధించిన నిష్కామ కర్మ యోగం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. నిష్కామ కర్మ అంటే ఫలితాన్ని పూర్తిగా విస్మరించి, నిరాశతో పని చేయడం కాదు. ఫలితంపై అతిగా మోహం పెంచుకోకుండా, దాని గురించి నిరంతరం ఆందోళన చెందకుండా, ప్రస్తుత క్షణంలో మనం చేయాల్సిన పనిని అత్యంత సృజనాత్మకంగా, నిబద్ధతతో, పారదర్శకంగా నిర్వహించడమే దీని అసలు సిసలైన అర్థం. ఇది ఒక ఉన్నతమైన మానసిక సమతుల్యత. లభించే ఫలితం సానుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా చలించకుండా మనసును ప్రశాంతంగా ఉంచుకోగలగడమే నిజమైన యోగ సాధన. ప్రస్తుత విపరీతమైన పోటీ ప్రపంచంలో మానసిక ఒత్తిడి, కుంగుబాటు (డిప్రెషన్) వంటి సమస్యలు పెరిగిపోతున్నాయి. దీనికి గల ప్రధాన కారణం మనుషులు ఫలితాలపైనే తమ దృష్టిని కేంద్రీకరించడం. ఆధునిక మనస్తత్వ శాస్త్రవేత్తలు సైతం ఈ విషయాలనే ధ్రువీకరిస్తున్నారు. మానసిక ప్రశాంతతను కాపాడుకోవడానికి ఈ తాత్విక చింతన ఒక సంజీవనిలా పనిచేస్తుంది. నియంత్రణలో లేని అంశాల గురించి ఆలోచించడం వల్ల మానసిక శక్తులు క్షీణిస్తాయి. అదే సమయంలో, మన నియంత్రణలో ఉన్న ప్రక్రియ (పని) పై దృష్టి పెడితే ఒత్తిడి తగ్గి, సృజనాత్మకత పెరుగుతుంది. అంతర్జాతీయ క్రీడాకారులు, శాస్త్రవేత్తలు తమ విజయ రహస్యాలను విశ్లేషిస్తూ తాము గెలుపోటముల గురించి కాకుండా కేవలం ఆట తీరుపై, పరిశోధనా విధానంపై దృష్టి పెట్టడం వల్లే అద్భుతాలు సృష్టించగలిగామని స్పష్టం చేశారు. నిజమైన కర్మయోగి విజయానికి పొంగిపోడు, అపజయానికి కృంగిపోడు. ఈ విశిష్టమైన జీవన శైలి మనుషులలో నిరాశను తొలగించి, నూతన ఉత్సాహాన్ని నింపుతుంది. ఇది పలాయనవాదం కాదు, అత్యున్నత బాధ్యతాయుత జీవన విధానం. శక్తినంతా కర్మపై ధారపోసి, ఫలితాన్ని కాల గమనానికి వదిలివేయడమే వివేకం. కనుక, శ్రమించినా ఫలితం రాలేదని నైరాశ్యంలో మునిగిపోకుండా, మన ప్రయత్నంలో నిజాయితీ ఉందో లేదో అని ఆత్మపరిశీలన చేసుకోవాలి. నిజాయితీతో కూడిన కర్మ ఎప్పటికీ వృథా పోదు. అది భవిష్యత్తులో నూతన అవకాశాలకు ద్వారాలు తెరుస్తుంది. ఇదే భారతీయ జీవన తత్వం మనకు అందించే శాశ్వత, సార్వత్రిక సందేశం.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

## నా దీక్షనే అనుమానిస్తారా...?

### కేంద్రంతో లాలూచీ పడతాననుకున్నారా

### విమర్శలపై సోనమ్ వాంగ్‌చుక్ ఘాటు స్పందన

దాదాపు 26 రోజుల పాటు నిరాహార దీక్ష చేసిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఇటీవల కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సమక్షంలో దీక్షను విరమించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్ నెరవేరకపోయినా తాను ఎందుకు నిరాహార దీక్ష విరమించాల్సి వచ్చిందో తాజాగా సోనమ్ వివరించారు. ప్రభుత్వంతో ఎలాంటి రహస్య ఒప్పందమూ చేసుకోలేదని, నిరసనకారుల భద్రత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై హింసాత్మక చర్యలు జరిగే అవకాశం ఉందన్న ఆందోళన తనకు కలిగిందని వాంగ్‌చుక్ పేర్కొన్నారు. గతంలో లడఖ్‌లో జరిగిన పోలీసు చర్యల మాదిరిగా పరిస్థితి మారకూడదనే ఉద్దేశంతో ఉపవాసాన్ని ముగించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం నుంచి కొన్ని అంశాలపై లిఖితపూర్వక హామీ లభించిందని ఆయన తెలిపారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన వారిపై ప్రతీకార చర్యలు ఉండవని, వారి సమస్యలపై చర్చ కొనసాగుతుందని ప్రభుత్వం హామీ ఇచ్చిందని వాంగ్‌చుక్ పేర్కొన్నారు (ఔఇఇ÷ ÷ఔసనీబిఙబబి). అయితే, దీక్ష విరమించడం అంటే ఉద్యమం ముగిసినట్లు కాదని స్పష్టం చేశారు. కాగా, జంతర్ మంతర్‌లో నిరసన చేపడుతున్న సీజేపీ నేతలు మాత్రం తమ ఆందోళన కొనసాగుతుందని ప్రకటించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదని వారు వెల్లడించారు. పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజులు చేసిన నిరాహార దీక్షను కేంద్రమంత్రుల సమక్షంలో విరమించిన నేపథ్యంలో.. డీల్ కుదిరిందంటూ ఆయనపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. వీటిని ఆయన తీవ్రంగా ఖండించారు. 'నేను చేసిన దీక్ష ఎంత స్వచ్ఛమైందో నిరూపించుకునేందుకు సర్టిఫికెట్ కావాలా.. అని ప్రశ్నించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో వీడియో విడుదల చేశారు. అలాగే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకుండానే దీక్ష విరమించడంపైనా స్పందించారు. దీక్ష విరమించినప్పటి నుంచి చాలా మంది నాకు ఫోన్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో పోస్టులు చూపిస్తూ.. మీపై పలు సందేహాలు వస్తున్నాయని చెప్తున్నారు. కేంద్రమంత్రుల సమక్షంలోనే ఎందుకు దీక్ష విరమించారు..? ఏం ఒప్పందం జరిగింది..? అని అడుగుతున్నారు. నేను నిరాహార దీక్ష ఎంత పవిత్రంగా చేశానో ఎవరి నుంచైనా సర్టిఫికెట్ తీసుకోవాలా..? ఇలా బేరాలు కుదుర్చుకోవాల్సి వస్తే.. ఎవరైనా 26 రోజులు ఆకలితో ఉంటారా..? దిల్లీ ఎండలో రోడ్డు పక్కన కూర్చునే బదులు.. ఏసీ గదిలో కూర్చొని డీల్ చేసుకోలేనా' అని తనపై వస్తోన్న విమర్శలకు వాంగ్‌చుక్ కౌంటర్ ఇచ్చారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనేది కచ్చితంగా ముఖ్యమైన విషయం. అయితే నిరసనకారులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోకుండా నిరోధించడమే నాకు ప్రాధాన్య అంశంగా అనిపించింది. అందుకే కేంద్రంతో చర్చల సమయంలో రాజీనామా గురించి నేను డిమాండ్ చేయలేదు. రాజీనామాను వ్యక్తిగతంగా ప్రస్తావించాల్సిన అవసరం ఉందని అనుకోవడం లేదు. దీన్ని కేంద్రం పెద్ద విషయంగా భావించడం లేదు. రాజీనామా అంశాన్ని నిరాకరించడం వల్ల అపారనష్టాన్ని చవిచూస్తోంది. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠ దిగజారుతోంది. ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. రాజీనామా విషయంలో ఎటూ తేల్చకుండా కేంద్రం ఎక్కువ కాలం నాన్చలేదు. కొన్నిరోజుల్లో మంత్రి రాజీనామా సమర్పిస్తారని నాకు తెలుసు.

# అమీన్పూర్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన ఎమ్మెల్యే జీఎంఆర్





**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 25:** కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలు నమోదు చేసుకుని పటాన్‌చెరు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం అమీన్పూర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ కాలనీలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. అధికారులతో మాట్లాడి నమోదు ప్రక్రియ పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు.సాఫ్ట్‌వేర్, ఫార్మా ఉద్యోగులు అధికంగా నివసించే గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లు, కాలనీల్లో ఎస్ఐఆర్‌పై మరింత విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం 59 శాతం నమోదు మాత్రమే పూర్తైందని, దానిని కనీసం మరో 20 శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రజాస్వామ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావడం తమ బాధ్యతగా భావించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు, ప్రచార వాహనాలు, సోషల్ మీడియా ప్రచారం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు మహాదేవ రెడ్డి, కృష్ణ, ప్రమోద్ రెడ్డి, చంద్రశేఖర్, దాసు, జగదీష్, అధికారులు మనోహర్, నరసింహ, అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌బీ నగర్ నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఎంసీహెచ్‌సీ కమిషనర్‌తో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి భేటీ

**క్రైమ్ మిర్రర్,ఎల్బీనగర్,జులై 25:** ఎల్‌బీ నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి శుక్రవారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు మరియు మౌలిక వసతుల కల్పనపై విస్తృతంగా చర్చించారు. ఆయా పనులను అత్యవసరంగా పూర్తి చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ చౌరస్తా వద్ద రోడ్డు విస్తరణ అంశంపై గతంలో చేసిన విజ్ఞప్తికి వెంటనే స్పందించి రహదారిని పరిశీలించినందుకు కమిషనర్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. చంపాపేట్ డివిజన్‌లోని సుల్తాన్‌వాల్వ మినీ ఫంక్షన్ హాల్ పునరుద్ధరణ, సుల్తాన్‌వాల్వ వీకర్ సెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్, షెడ్, మరుగుదొడ్లు, బోర్‌వెల్ వంటి మౌలిక సదుపాయాల పనులను పూర్తి చేయాలని కోరారు. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని మహా గాయత్రీ నగర్‌లో సీసీ రోడ్డు, ఓపెన్ జిమ్ ఏర్పాటుతో పాటు సాయిగార్డెన్ కాలనీలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు నిర్మాణానికి వెంటనే ఎరిపాలనా అనుమతులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. మన్సూరాబాద్ డివిజన్‌లో పాత పోచంపల్లి రోడ్డును పునరుద్ధరించాలని, మహావీర్ హరిణీ వనస్థలి ప్రాంతంలో ఆక్రమణకు గురైనట్లు భావిస్తున్న ఈ రహదారిని తిరిగి స్వాధీనం చేసుకుని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కోరారు. సుమారు 50 కాలనీలకు అనుసంధానంగా ఉన్న ఈ రహదారి వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన పాత జిల్లా పరిషత్ (జెడ్పీ) రోడ్డు అని, గెజిట్‌లో నమోదై ఉండటంతో పాటు ఔటర్ రింగ్ రోడ్డుకు (ఓఆర్ఆర్) కీలక అనుసంధాన మార్గంగా ఉపయోగపడుతుందని పేర్కొంటూ దీనికి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బీఎన్ రెడ్డి డివిజన్‌లో పలు అభివృద్ధి పనులను కూడా ఎమ్మెల్యే కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. హరిహరపురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్‌పై అదనపు అంతస్తు నిర్మాణం, విజయపురి ఫేజ్-1 సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంపై మొదటి అంతస్తు నిర్మాణం, విజయ్‌నగర్ (ఎస్ఎస్‌వీ కాలనీ)లో ప్లాట్ నం.77 నుంచి ప్లాట్ నం.54 వరకు అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణం, ఎస్‌కేడీ నగర్‌లో అంతర్గత సీసీ రోడ్లు, వివేకానంద పార్క్ (ఎన్‌జీఓస్ కాలనీ), మెడికల్ అండ్ హెల్త్ కాలనీల్లో ఓపెన్ జిమ్‌లు, పిల్లల ఆటల పరికరాల ఏర్పాటు, మారుతీనగర్ పార్క్‌కు కాంపౌండ్ వాల్ నిర్మాణం, పార్కు అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కోరారు. అదేవిధంగా కప్రాయి చెరువు ఫారెస్ట్ ప్రాంతం నుంచి దిగువకు నిర్మాణంలో ఉన్న వరదనీటి కాలువ పనుల్లో మిగిలిన భాగాన్ని పూర్తి చేయాలని, శివసాయి కాలనీలో ఓపెన్ డ్రైనేజీ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రస్తుతం జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నాయని, సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, రెండు నుంచి మూడు రోజుల్లో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, భాస్కర్ సాగర్, రవి ముదిరాజ్, గండికోట శ్రీనాథ్‌తో పాటు పలు కాలనీల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





## క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు కంటెంట్ రైటర్లు కావలెను

సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595


# చెంచువాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ

## పెబ్బేరు మండల విద్యాధికారి ఎస్ జయరాములు

**వనపర్తి జూలై 25 క్రైమ్ మిర్రర్:** పెబ్బేరు మున్సిపాలిటీలో ఏడవ వాడు చెంచువాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శనివారం మండల విద్యాధికారి ఎస్. జయరాములు ,ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఈఓ పాఠశాల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు.ప్రార్థన సమయానికి హాజరు అయ్యి.. ప్రార్థనలో విద్యార్థుల హాజరు, విద్యార్థుల ఆక్టివిటీస్ ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధానంగా ఎఫ్.ఎల్.ఎన్. పరీక్షా విధానాన్ని పరిశీలించారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని అంచనా వేసే విధానం, ఉపాధ్యాయులు అనుసరిస్తున్న బోధనా పద్ధతులు, మూల్యాంకన ప్రక్రియపై ఆరా తీసి తగిన సూచనలు చేశారు.అనంతరం నాలుగో తరగతి విద్యార్థుల ఆంగ్ల భాషా నైపుణ్యాలను ప్రత్యక్షంగా పరీక్షించి, వారి చదవడం, రాయడం, అర్థం చేసుకునే సామర్థ్యాన్ని ఆయన పరిశీలించారు. అలాగే పాఠశాలలోని ప్రీ-ప్రైమరీ తరగతులను సందర్శించి చిన్నారులకు అందిస్తున్న విద్యా బోధన, అభ్యాస వాతావరణాన్ని పరిశీలించారు.మధ్యాహ్న భోజన పథకం అమలు, భోజన నాణ్యత, పరిశుభ్రత, నిర్వహణను పరిశీలించారు. అదేవిధంగా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, విద్యార్థుల హాజరు పట్టికలు మరియు ఇతర పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు.విద్యార్థుల హాజరు, క్రమశిక్షణ, పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన మండల విద్యాధికారి, ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, గణిత నైపుణ్యాల అభివృద్ధికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నాణ్యమైన విద్య అందించేందుకు నిరంతరం కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి చిన్నరాములు . ఉపాధ్యాయులు స్వాతి ,మాధురి ,రాధా ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ కృష్ణవేణి. పుష్పవతి పాల్గొన్నారు.





# జగద్గిరిగుట్ట సిఐ సురేష్ కు చంద్రారెడ్డి శుభాకాంక్షలు

**కూకట్ పల్లి, జూలై 25 (క్రైమ్ మిర్రర్) :** జగద్గిరిగుట్ట నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన సురేష్ కు వెంకటేశ్వర్ నగర్ డివిజన్ పాపిరెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు వెల్ఫేర్ సభ్యులు సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ప్రదన కార్యదర్శి ఆర్. భగవంతరెడ్డి, కోశాధికారి నరసింహులు ముదిరాజ్, నేతలు ఆర్. తిరుపతిరెడ్డి, పి .శంకర్ రెడ్డి, తాటి కిరణ్, సత్యనారాయణ రెడ్డి, కనకయ్య, హెచ్ రాజు రెడ్డి పాల్గొన్నారు.

# అర్ధరాత్రి నిబంధనల ఉల్లంఘనపై 8 మందిపై పెట్టీ కేసులు..

## సామాజిక సేవ చేయాలని శిక్ష విధించిన కోర్టు




క్రైమ్ మిర్రర్,ఎల్.బి. నగర్, జూలై 25:ప్రజా శాంతి భద్రతల పరిరక్షణతో పాటు చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేస్తున్న ఎల్.బి. నగర్ పోలీసులు చట్ట ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఎల్.బి. నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 8 పెట్టీ కేసులు నమోదు చేశారు.ఎల్బీనగర్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం .. అర్ధరాత్రి నిబంధనలను ఉల్లంఘిస్తూ టిఫిన్ సెంటర్లు నిర్వహిస్తున్న ఇద్దరు నిర్వాహకులతో పాటు, బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు అసౌకర్యం కలిగిస్తూ ఇబ్బందులు సృష్టించిన ఆరుగురు వ్యక్తులపై పోలీసులు కేసులు నమోదు చేశారు.నమోదైన కేసులను ఎల్.బి. నగర్ ఎ× మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ న్యాయస్థానం ముందు హాజరుపరచగా, గౌరవ న్యాయస్థానం ఎనిమిది మంది నిందితులకు స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా సామాజిక సేవ (కమ్యూనిటీ సర్వీస్) నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది.కోర్టు ఆదేశాల మేరకు శనివారం (జూలై 25) శిక్ష పొందిన వ్యక్తులు ఎల్.బి. నగర్ పోలీసుల పర్యవేక్షణలో చిత్ర లేఅవుట్‌లోని అనాథ విద్యార్థి గృహంలో స్వచ్ఛ భారత్ పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అక్కడి అనాథ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎల్.బి. నగర్ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించి పాటించాలని, బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు అసౌకర్యం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. పరిశుభ్రత, శాంతి భద్రతలు, ప్రజా క్రమశిక్షణ పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

# కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల పోరోటానికి దక్కిన చారిత్రక విజయం...

## నేలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు కొమ్మూరి నరేష్



**క్రైమ్ మిర్రర్ ఖమ్మం :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత సాగించిన ఉద్యమానికి దక్కిన విజయమని నేలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు కొమ్మూరి నరేష్ అన్నారు..న్యాయమైన డిమాండ్ల కోసం లాఠీచార్జీలు,నిర్బంధాలను ఎదుర్కొంటూ పోరాడిన విద్యార్థుల ధైర్యసాహసాలకు అభినందనలు..ఈ ఉద్యమం యువత ఐక్యంగా పోరాడితే మార్పు సాధ్యమేనని మరోసారి నిరూపించింది,కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల ఆకాంక్షలను గౌరవించి విద్యా వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాం...యువత కు, విద్యార్థులకు అండగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు...

# మూతపడే పరిస్థితి నుంచి 40 మంది విద్యార్థులతో
# ప్రభుత్వ పాఠశాలకు పునర్జీవం

### బోడబండ తాండా ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన డీఈవో

### ఆంగ్ల మాధ్యమ బోధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన

### ఎల్లూరులో అక్షర ప్రైవేట్ పాఠశాలపై ఆకస్మిక తనిఖీ, సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎంఈఓకు ఆదేశం



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పనిచేయాలి జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) రమేష్ కుమార్ అన్నారు. శనివారం కొల్లాపూర్ మండలంలోని బోడబండ తాండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యా కార్యకలాపాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ప్రజావాణిలో అందిన ఫిర్యాదు మేరకు ఏల్లూరు గ్రామంలోని అక్షర ప్రైవేట్ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ముందుగా బోడబండ తాండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తరగతి గదులను పరిశీలించిన డీఈవో, విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి అభ్యాస సామర్థ్యాన్ని అంచనా వేశారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న విధానం, విద్యార్థుల హాజరు, పాఠ్యాంశాల బోధన, పాఠశాల నిర్వహణ, విద్యా ప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై పట్టు పెంపొందించేలా ప్రతి ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఆంగ్ల మాధ్యమంలో సమర్థవంతంగా బోధన సాగించే విధంగా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని మరింత పెంచేలా ఉపాధ్యాయులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని కోరారు. ఈ సందర్భంగా డీఈవో రమేష్ కుమార్ మాట్లాడుతూ...., బోడబండ తాండా ప్రభుత్వ పాఠశాల గత కొన్నేళ్లుగా విద్యార్థుల కొరతను ఎదుర్కొన్నదని తెలిపారు. గత ఐదేళ్ల కాలంలో కేవలం ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఈ పాఠశాలకు హాజరవుతుండటంతో పాఠశాల కొనసాగింపే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలో ఒక్క విద్యార్థి కూడా నమోదు కాకపోవడంతో పాఠశాలను మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని గుర్తు చేశారు. అయితే గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు కలిసి చేసిన కృషి ఫలితంగా ప్రస్తుతం పాఠశాలలో 40 మంది విద్యార్థులు చేరడం ఎంతో సంతోషకరమైన విషయమని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలంటే సమాజం భాగస్వామ్యం అత్యంత అవసరమని, బోడబండ తాండా గ్రామస్తులు చూపిన చొరవ ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుందని ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని డీఈవో స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తోందని, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, నోట్‌బుక్స్, మధ్యాహ్న భోజనం, ఇతర విద్యా సామగ్రిని ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఈ అవకాశాలను వినియోగించుకొని ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. విద్యతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, విలువలతో కూడిన బోధన ప్రభుత్వ పాఠశాలల్లో అందుతోందని, పాఠశాల సందర్శన సందర్భంగా గ్రామస్తులు, మాజీ జడ్పీటీసీ హనుమంతు నాయక్ డీఈవోకు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిన నేపథ్యంలో మరో ఉపాధ్యాయుడిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల సంఖ్య కు అనుగుణంగా ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన డీఈవో సంబంధిత అంశాలను పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కొల్లాపూర్ మండలంలోని ఏల్లూరు గ్రామంలో కొనసాగుతున్న అక్షర ప్రైవేట్ పాఠశాలను డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో తగిన మౌలిక వసతులు లేవని ప్రజావాణిలో అందిన ఫిర్యాదు నేపథ్యంలో ఈ తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల నమోదు వివరాలు, ఉపాధ్యాయుల అర్హతలు, హాజరు రిజిస్టర్లు, తరగతి గదుల పరిస్థితి, తాగునీరు, మరుగుదొడ్లు, భద్రతా ప్రమాణాలు, ఇతర సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీ అనంతరం మండల విద్యాధికారి (ఎంఈఓ)తో ఫోన్‌లో మాట్లాడిన డీఈవో రమేష్ కుమార్, మరోసారి పూర్తి స్థాయిలో తనిఖీ నిర్వహించి సమగ్ర నివేదికను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏ విద్యాసంస్థ పనిచేసినా ఉపేక్షించబోమని, విద్యార్థుల భవిష్యత్తుతో రాజీ పడే పరిస్థితిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ప్రైవేట్ పాఠశాలలు కూడా ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డిఇఓ ఈ సందర్భంగా సూచించారు. డిఇఓ వెంట జిల్లా టెస్ట్‌బుక్ మేనేజర్ నరసింహ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ స్వామి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఉన్నారు

## ఖమ్మంలో మహిళలను ఆకట్టుకుంటున్న వాసంతి క్రియేషన్స్ మెగా ఎక్స్ పో



**క్రైమ్ మిర్రర్ ఖమ్మం :** ఖమ్మం నగరం త్రిబుల్ ఆర్ ఫంక్షన్ హాల్ లో వాసంతి క్రియేషన్స్ మెగా ఎక్స్పో మహిళలను ఆకట్టుకుంటుంది. శారీస్ మగ్గం వర్క్స్ జ్యువలరీ ఐటమ్స్ అత్యధిక డిజైన్లతో ఖమ్మం మహిళలను తెగ ఆకట్టుకుంటుంది. దీంతో ఖమ్మంలో శని ఆదివారాల్లో బైపాస్ రోడ్డు ఫంక్షన్ హాల్ లో రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా నిర్వాహకురాలు వాసంతి మాట్లాడుతూ ప్రత్యేకంగా కుట్టిన డిజైనర్ బ్లౌజులు (పైఠానీ ఎంబ్రాయిడరీ వర్క్ శ్రేణులతో సహా)వెస్ట్రన్ వేర్ మరియు సాంప్రదాయ ఎత్నిక్ కలెక్షన్లు ఖమ్మం జిల్లా మహిళాకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## కల్వకుర్తిలో నిర్మల విద్యాలయంపై విద్యార్థుల ఫిర్యాదు..

### పోలీసులను ఆశ్రయించిన ఏబీవీపీ, బీజేపీ నాయకులు



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కల్వకుర్తి పట్టణంలోని నిర్మల విద్యాలయం మిషనరీ పాఠశాల హాస్టల్‌లో చదువుతున్న కొందరు విద్యార్థులు తమపై మతం మారాలని ఒత్తిడి తెస్తున్నారని ఆరోపిస్తూ శనివారం స్థానిక పోలీసులను ఆశ్రయించారు. విద్యార్థుల కథనం ప్రకారం.. హాస్టల్ వార్డెన్ జయశ్రీతో పాటు నన్స్ గత కొన్నేళ్లుగా ప్రతిరోజూ ప్రార్థనలు చేయాలని, ప్రతి ఆదివారం చర్చికి రావాలని, బొట్టు ధరించవద్దని ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. తమ మాట వినకపోతే నాసిరకం ఆహారం అందించడం, మోకాళ్లపై కూర్చోబెట్టి శిక్షించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని విద్యార్థులు ఆరోపించారు. ఈ విషయాన్ని విద్యార్థులు స్థానిక ఏబీవీపీ నాయకులకు తెలియజేయడంతో, ఏబీవీపీ, బీజేపీ నాయకులు నిర్మల విద్యాలయానికి వెళ్లి పాఠశాల ప్రిన్సిపాల్‌ను కలిసి వివరణ కోరారు. అనంతరం సంబంధిత వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులతో కలిసి కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ కురుమూర్తికి ఫిర్యాదు చేశారు. పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులు తమ సమస్యలను వివరించగా, విచారణ జరిపి చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి పట్టణ బీజేపీ అధ్యక్షుడు గన్నోజు బాబీదేవ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు బోడ నరసింహ, కౌన్సిలర్లు వడ్డే శ్రీరాములు, ఎనుగొండ రామకృష్ణ, హనుమంత్ గౌడ్, దేరంగుల శివ, లక్ష్మీనరసింహ, శ్రీకాంత్, బీజేవైఎం నాయకులు మాయని రాజశేఖర్, రఘుచారి, సాయి, ఏబీవీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ప్రశాంత్ యాదవ్, ఏబీవీపీ నాయకులు శివరాం, చరణ్, భరద్వాజ్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన బోయపల్లి రాఘవేందర్ రెడ్డి


**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** 25 లక్షల వ్యయంతో మంజూరైన హైమాత టెంపుల్ నుండి కోమటికుంట చెరువు వరకు బీటీ రోడ్డు పనులను ఏఐసీసీ -విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, బడంగ్‌పేట్ సర్కిల్ ఏఈ హరీష్, డిఈ హరిణితో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు రహదారి పనులను త్వరలోనే ప్రారంభించి, నిర్ణీత గడువులో నాణ్యతతో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారడంతో పాటు, సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని తెలిపారు. అనంతరం బోయపల్లి రాఘవేందర్ రెడ్డి స్థానిక పోచమ్మ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణం అత్యవసరమని స్థానికులు కోరగా, సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే సీసీ రోడ్డు పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించి 25 లక్షల బీటీ రోడ్డు మంజూరుకు కృషి చేసిన మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చన్నగారి లక్ష్మా రెడ్డి, మాజీ మేయర్ చిగురింత పారిజాత నరసింహారెడ్డికి బోయపల్లి రాఘవేందర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



## ప్రభుత్వ డిగ్రీ,పీజీ కళాశాలలో అతిధి అధ్యాపకులను మల్టిజోన్-1 వారినే తీసుకోవాలి

### ఏ.ఐ.ఎస్.ఎఫ్,ఏ.ఐ.వై.ఎఫ్ ఆధ్వర్యంలో ఎస్.ఆర్‌డబి.జి.యన్.ఆర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ కి విన్నతీ.

### సానుకూలంగా స్పందించిన ప్రిన్సిపల్ మల్టిజోన్- 1 లో ఉన్న వారినే నిబంధనల ప్రకారం భర్తీ చేస్తాం అన్ని హామీ.




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ,పీజీ కళాశాలలో అతిధి అధ్యాపకులను మల్టీ జోన్-1 లో ఉన్న స్థానికులకే అవకాశాలను కల్పించి పోస్టులను భర్తీ చేయాలని ఏ.ఐ.ఎస్.ఎఫ్ జాతీయ నేత ఇటుకల. రామకృష్ణ,ఏ.ఐ.వై.ఎఫ్ జిల్లా నాయకులు చింతల.రమేష్, మధోజు. శ్రావణ్ లు డిమాండ్ చేశారు. ప్రభుత్వ డిగ్రీ,పీజీ కళాశాలలో అతిధి అధ్యాపకులను మల్టిజోన్-1 వారినే తీసుకోవాలనీ ఏ.ఐ.ఎస్.ఎఫ్, ఏ.ఐ.వై.ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్.ఆర్‌డబి.జి.యన్.ఆర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ జాకిరుల్లాకి విన్నతీపత్రం ఇవ్వడం జరిగింది. వెంటనే సానుకూలంగా స్పందించిన ప్రిన్సిపల్ మల్టిజోన్- 1 లో ఉన్న స్థానికులను నిబంధనల ప్రకారం భర్తీ చేస్తాం అన్ని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సానుకూలంగా స్పందించిన ప్రిన్సిపల్ గారికి వారు ధన్యవాదాలు తెలుపుతూ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో నూతనంగా అతిథి అధ్యాపకుల పోస్టులను మల్టీ జోన్-1 లో కాకుండా ఓపెన్ గా భర్తీ చేయడం వల్ల నాన్ లోకల్ వారికి ఉద్యోగాలు రావడం వల్ల స్థానికులు నష్టపోతున్నారని, మల్టీజోన్-1 లో ఉన్న వాటికే నిబంధనల ప్రకారం ఇవ్వడం వల్ల స్థానికులకు ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.ఎస్.ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బుర్ర.మనోజ్, ఏ.ఐ.వై.ఎఫ్ ఖమ్మం నగర నాయకుడు కృష్ణ ప్రసాద్ లు పాల్గొన్నారు.



## పటాన్‌చెరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిఐఈఓ ఆకస్మిక తనిఖీ

### రికార్డుల నిర్వహణ, క్రమశిక్షణపై ప్రశంసలు..

### ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా కృషి చేయాలని సూచన

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 25:** పటాన్‌చెరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను సంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్ రామ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలోని మౌలిక వసతులు, తరగతి గదులు, అకడమిక్ రికార్డులు, హాజరు రిజిస్టర్లు, అధ్యాపకుల టీచింగ్ డైరీలను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, పరిశుభ్రత, విద్యార్థుల క్రమశిక్షణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన డిఐఈఓ, ఈ విద్యాసంవత్సరంలో కళాశాలలో అడ్మిషన్లు గణనీయంగా పెరగడాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానాచార్యులు ఆర్. వేంకటేశ్వరరావు, అధ్యాపక బృందాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో అధ్యాపకులు ప్రవేశాల పెంపుతో పాటు వార్షిక పరీక్షల్లోనూ అత్యుత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమైన ఆయన క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రతతో పరీక్షలకు సిద్ధం కావాలని సూచిస్తూ, ఉన్నత విద్యా అవకాశాలు, కెరీర్ మార్గాలు, పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రధానాచార్యులు ఆర్. వేంకటేశ్వరరావు మాట్లాడుతూ.. నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, మెరుగైన వసతుల కారణంగానే ప్రతి సంవత్సరం అడ్మిషన్లు పెరుగుతున్నాయని తెలిపారు. కళాశాలను సందర్శించి విలువైన సూచనలు చేసిన డిఐఈఓ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామ్య విజయం: ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

## విద్యార్థి శక్తి ముందు నిరంకుశత్వం లొంగాల్సిందేనని ఉద్ఘాటన

## లక్షలాది మంది భవిష్యత్తుతో ఆడుకున్న కేంద్రానికి చెంపపెట్టు

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ప్రజాస్వామ్యానికి దక్కిన గొప్ప విజయమని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థి శక్తి ముందు నిరంకుశత్వం తప్పకుండా లొంగాల్సిందేనని ఆయన తేల్చిచెప్పారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు, భవిష్యత్తుతో ఆడుకున్న కార్పొరేట్-కాషాయ సర్కారుకు ఈ పరిణామం ఒక బలమైన చెంపపెట్టు అని ఆయన విమర్శించారు. ఈ సువర్ణాక్షర విజయం దేశవ్యాప్తంగా ఉన్న పోరాట శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపిందని పేర్కొంటూ శనివారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.



**తొలినుంచీ గళమెత్తిన రాహుల్ గాంధీ గారు..**

గత పార్లమెంట్ సమావేశాల్లోనే నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర చర్చ జరగాలని లోక్‌సభ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గట్టిగా డిమాండ్ చేసినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఎలాంటి తప్పు జరగనట్లుగా అహంభావంతో వ్యవహరించిందని ఎంపీ రఘురాం రెడ్డి మండిపడ్డారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తీవ్ర ఆందోళనలు చేపట్టినా, రాహుల్ గాంధీ స్వయంగా ప్రధానమంత్రి నివాసం ముందు ధర్నా నిర్వహించినా... కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు, ప్రతిపక్షాలు, ప్రజల డిమాండ్లను ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. ఎట్టకేలకు విద్యార్థులు, రాహుల్ గాంధీ సంయుక్త పోరాటాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం, నరేంద్ర మోదీ తొలిసారిగా దిగివచ్చి రాజీనామాను స్వీకరించాల్సి వచ్చిందని ఆయన గుర్తుచేశారు.

**కేవలం రాజీనామాతో సరిపోదు.. సమగ్ర చర్చ జరగాలి**

కేవలం కేంద్ర మంత్రి రాజీనామాతో ఈ సమస్యకు పూర్తి పరిష్కారం లభించదని, దీనిపై పార్లమెంట్‌లో లోతుగా చర్చ జరగాలని ఎంపీ డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పేపర్ లీకేజీ ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, జాతీయ స్థాయి పోటీ పరీక్షలన్నింటినీ అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇకనైనా అహంభావాన్ని వీడి ప్రతిపక్ష పార్టీలకు, ప్రజల ఆకాంక్షలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని రఘురాం రెడ్డి హితవు పలికారు.



## బృందావనం కాలనీలో తాగునీటిలో డ్రైనేజీ నీరు కలుస్తోందని స్థానికుల ఆందోళన

### సమస్య పరిష్కారానికి చర్యలు

### కాంగ్రెస్ పార్టీ జీహెచ్ఎంసీ 123వ డివిజన్ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని గండిపేట మండల పరిధిలోని జీహెచ్ఎంసీ 123వ డివిజన్ బృందావనం కాలనీలో తాగునీటి పైప్‌లైన్‌లో డ్రైనేజీ నీరు కలుస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను కాంగ్రెస్ పార్టీ జీహెచ్ఎంసీ 123వ డివిజన్ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పూలపల్లి కృష్ణారెడ్డి వెంటనే కాలనీని సందర్శించి స్థానికులతో మాట్లాడారు. తాగునీటి సరఫరాలో ఏర్పడిన సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం జీహెచ్ఎంసీ, మున్సిపల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఆయన, సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశం కావడంతో అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి డ్రైనేజీ నీరు తాగునీటి పైప్‌లైన్‌లో కలవకుండా శాశ్వత పరిష్కారం చూపాలని సూచించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పూలపల్లి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలపై రాజీ పడే ప్రసక్తే లేదని, బృందావనం కాలనీ వాసులకు స్వచ్ఛమైన తాగునీరు అందే వరకు అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ సమస్య పూర్తిగా పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## కేంద్ర మంత్రి రాజీనామా సందర్భంగా కాంగ్రెస్ పార్టీ విజయోత్సవ ర్యాలీ



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్ల నరసింహారెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా సందర్భంగా, బడంగ్ పేట్ వినాయక మండపం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ర్యాలీ అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై విద్యార్థులు సాధించిన విజయమని, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు అయినా కాంగ్రెస్ పార్టీ వారికి అండగా నిలుస్తుందని, నీట్ పేపర్ లీకేజ్ పై విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తున్న సమయంలో వారిపై ఎన్నో దాడులకు పాల్పడ్డారని అయినా విద్యార్థులు వెనక్కి తగ్గలేదని తెలుపుతూ వారికి కాంగ్రెస్ పార్టీ అగ్రనేత మద్దతుగా నిలిచారని, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న భారతీయ జనతా పార్టీ తన వైఖరి మార్చుకోవాలంటూ ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ని అరెస్ట్ చేయడాని ఖండిస్తూ, కేంద్ర మంత్రి రాజీనామా కాంగ్రెస్ పార్టీ విజయంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, రంగారెడ్డి జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీంభారత్, రంగారెడ్డి జిల్లా మాజీ జెడ్పి చైర్ పర్సన్ తీగల అనిత రెడ్డి, బడంగ్పేట్ డివిజన్ ప్రెసిడెంట్ బంగారి అశోక్, మీర్పేట్ ప్రెసిడెంట్ చల్లా బాల్ రెడ్డి, జిల్లెలగూడ సిద్ధల శ్రీశైలం, ప్రశాంతి హిల్స్ ప్రెసిడెంట్ సురేందర్ రెడ్డి, నాదర్గుల్ ప్రెసిడెంట్ బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, బాలాపూర్ ప్రెసిడెంట్ శ్రీరాములు, బడంగ్ పేట్ సర్కిల్ లోని కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్, కార్యకర్తలు మరియు అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొని ర్యాలీని విజయవంతం చేయడం జరిగింది.

## మణికొండ డివిజన్ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడు బొడ్డోలు శ్రీరాములకు ఘన సన్మానం





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మణికొండ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన బొడ్డోలు శ్రీరాములుకు శనివారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ బొడ్డోలు శ్రీరాములు పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి సమర్థవంతంగా కృషి చేస్తారనే పూర్తి విశ్వాసం తమకు ఉందన్నారు. మణికొండ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఆకాంక్షించారు. సన్మానానికి స్పందించిన బొడ్డోలు శ్రీరాములు మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి డివిజన్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో మణికొండ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే కాకుండా, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు లక్ష్మి శ్రీ, ఏర్పుల కుమార్, శివగంగ, శ్రవణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువజన ప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన అధ్యక్షుడు బొడ్డోలు శ్రీరాములకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ జెండాలు, నినాదాల మధ్య ఉత్సాహభరితంగా జరిగింది.



## 140 ఘనంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

**చండూరు, క్రైమ్ మిర్రర్:** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని చండూరు పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయములో భక్తిశ్రద్ధల నడుమ సామూహిక సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ పూజారులు గుర్రం సత్యనారాయణ పంతులు, చెరుపల్లి వెంకటేశం పంతులు ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల మధ్య ఈ పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలి ఏకాదశి విశిష్టతను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక అలంకరణలు చేసి, భక్తులచే సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిపించారు. వ్రతానంతరం నిర్వహించిన భజన కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ ఆవరణ అంతా గోవింద నామస్మరణతో, భక్తి పారవశ్యంతో మారుమోగింది. ఆధ్యాత్మిక కార్యక్రమం అనంతరం భక్తులందరికీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాద వితరణ గావించారు. ఈ పావన కార్యక్రమంలో చండూరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి తరించారు.

## ఉమామహేశ్వరాలయంలో వైభవంగా శ్రీ మద్భగవద్గీతా మహాయజ్ఞం



**చండూరు, క్రైమ్ మిర్రర్:** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని చండూరు పట్టణంలోని పురాతన, ప్రాచీన శివాలయమైన శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ మద్భగవద్గీతా మహాయజ్ఞం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలి ఏకాదశి మహోత్సవంలో భాగంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించిన అనంతరం గీతా మహాయజ్ఞాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఈ యజ్ఞంలో స్థానిక భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హోమం అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులందరూ కలిసి సామూహిక గీతా పారాయణం చేశారు. పారాయణంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో పరవశించింది. కార్యక్రమం ముగిసిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ధర్మకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో భక్తజనం పాల్గొన్నారు.

## విద్యార్థుల ఐక్య పోరాటానికి దక్కిన గొప్ప విజయం

### రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు.



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయడం అనేది విద్యార్థులు, యువత నిర్వహించిన ఐక్య పోరాటానికి దక్కిన గొప్ప విజయమని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. ఇది కేవలం ఒక వ్యక్తి పదవి నుంచి తప్పుకోవడం మాత్రమే కాదని విద్యార్థి కి ముందు కేంద్ర ప్రభుత్వ అహంకార రాజకీయాలు తలవంచిన అరుదైన సందర్భం అని ఆయన పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం గద్ద దిగడానికి ఈ రాజీనామా తొలిమెట్టుగా నిలుస్తుందని భీమా వ్యక్తం చేశారు. విద్యార్థులు యువత భవిష్యత్తుతో చెలగాటమాడితే దేశ యువత ఏమాత్రం సహించదని తగిన రీతిలో బుద్ధి చెబుతుందని ఈ ఉద్యమం స్పష్టంగా నిరూపించిందని రాయల నాగేశ్వరరావు అన్నారు. రాజ్యాంగం పౌరులకు కల్పించిన నిరసన తెలిపే హక్కులను భరించాలని చూస్తే ప్రజలు మరింత ఐక్యంగా పోరాడతారనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా గ్రహించాలని అన్నారు. ఈ రాజీనామా పరిణామం దేశ ప్రజల్లో కేంద్ర ప్రభుత్వంపై వస్తున్న తీవ్ర అసంతృప్తికి స్పష్టమైన నిదర్శనం అని అన్నారు. ఉపాధి భవిష్యత్తుకు సంబంధించిన అంశాల్లో కేంద్ర ప్రభుత్వం తన పాత వైఖరిని పూర్తిగా మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ చారిత్రాత్మక ఉద్యమంలో పాల్గొని విజయం సాధించిన విద్యార్థులకు యువజన సంఘాలకు ప్రజాస్వామ్య శక్తులందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# మణికొండ డివిజన్ అధ్యక్ష నియామకంపై పీసీసీ అధ్యక్షుడికి కాంగ్రెస్ నాయకుల వినతి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మణికొండ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వ్యక్తికి కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ నేక్నంపూర్, మణికొండ ప్రాంత కాంగ్రెస్ నాయకులు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షుడిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మణికొండ డివిజన్‌లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారి సంఖ్య చాలా తక్కువగా ఉన్నప్పటికీ, పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా అంకితభావంతో పనిచేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలను పక్కనపెట్టి కొత్తగా చేరిన వ్యక్తికి డివిజన్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం వల్ల పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని వివరించారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేసిన సీనియర్ కార్యకర్తలకు న్యాయం చేయాలని వారు పీసీసీ అధ్యక్షుడిని కోరారు. వినతిని స్వీకరించిన పీసీసీ అధ్యక్షుడు స్పందిస్తూ, ఈ అంశంపై జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడితో సమగ్రంగా చర్చిస్తానని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ఆగస్టు 3న ముగిసిన అనంతరం సంబంధిత నాయకులను మరోసారి సమావేశానికి ఆహ్వానించి అన్ని అంశాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రతి డివిజన్‌లో విజయవంతం చేయాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పీసీసీ అధ్యక్షుడు సూచించినట్లు నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో నేక్నంపూర్ డివిజన్ అధ్యక్షుడు మెరుగు జితేందర్, కిరణ్ కుమార్, లక్ష్మీనారాయణ, ముత్యాలు, మల్లేష్, తాజ్ భాయ్, కె. సతీష్, కె. శ్రవణ్, అఖిల్, శరత్, పురుషోత్తం, పృథ్వీరాజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇందిర, మాణికొండ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



## ఓటర్ సవరణ ప్రక్రియను ప్రతి ఒక్కరు సద్వినియోగ పరుచుకోవాలి : బోయపల్లి గోవర్ధన్ రెడ్డి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** జిహెచ్ఎంసి 57వ డివిజన్ నాదర్గుల్ పరిధిలో సర్ కార్యక్రమంలో భాగంగా ఓటర్లను గుర్తించి, ఫోన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించిన నాదర్గుల్ డివిజన్-57 అధ్యక్షులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి. సర్ కార్యక్రమంలో భాగంగా బిఎల్ఓ బిఎల్ఏ ల సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకుని తమ ఓటు హక్కును పదిలపరుచుకోవాలని ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి తెలిపారు.

## ఓటరు జాబితా సవరణపై బిఆర్ఎస్ అవగాహన కార్యక్రమం

**ప్రతి ఓటరు మ్యాపింగ్ తప్పనిసరి**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ప్రతి ఓటరు సక్రమంగా పూర్తి చేసుకోవాలని, తమ వద్ద ఇప్పటికే ఓటరు గుర్తింపు కార్డు ఉందనే కారణంతో నిర్లక్ష్యం చేయరాదని బిఆర్ఎస్ నాయకులు ప్రజలకు సూచించారు. శనివారం మణికొండ, నెక్నంపూర్ డివిజన్లలో స్థానిక ఓటర్లకు అవగాహన కల్పిస్తూ పార్టీ నాయకులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు అందె లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, దేవిప్రియ, మంజు మాట్లాడుతూ, భారత ఎన్నికల వ్యవస్థలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ కీలకమైనదని పేర్కొన్నారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల దృష్ట్యా మణికొండ, నెక్నంపూర్ డివిజన్లలో ఓటరు జాబితాలో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని తెలిపారు. బూత్ లెవల్ అధికారుల పాత్ర ఎంత ముఖ్యమో, ప్రజల సహకారం కూడా అంతే అవసరమని వారు అన్నారు. ప్రస్తుతం ఓటరు కార్డు ఉందనే కారణంతో ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా, ఎన్నికల అధికారుల సూచనల మేరకు అవసరమైన ప్రక్రియలను పూర్తి చేయాలని సూచించారు. అలాగే ప్రతి ఓటరు తమ వివరాలను ధృవీకరించుకోవడంతో పాటు, సంబంధిత మార్గదర్శకాల ప్రకారం తమ ఓటును కుటుంబ సభ్యుల లేదా పూర్వపు ఓటరు రికార్డులతో మ్యాపింగ్ చేయించుకోవడం అత్యంత ముఖ్యమని వివరించారు. అలా చేయకపోతే భవిష్యత్తులో ఓటు హక్కు వినియోగంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు ఓటరు జాబితా సవరణ విధానాలు, అవసరమైన పత్రాలు, నమోదు ప్రక్రియపై వివరంగా అవగాహన కల్పించి, అవసరమైన సహాయ సహకారాన్ని అందించినట్లు బిఆర్ఎస్ నాయకులు తెలిపారు.

## నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కాంగ్రెస్ నిరసన

**విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం**

**మైలార్‌దేవ్‌పల్లి--కాటేదాన్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్. ధనుంజయ**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నీట్ పేపర్ లీకేజీ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు గురిచేసిందని, సుమారు 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని మైలార్‌దేవ్‌పల్లి--కాటేదాన్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్. ధనుంజయ పేర్కొన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరాల పాటు కష్టపడి చదివిన విద్యార్థుల ఆశలను పేపర్ లీకేజీ ఘటన దెబ్బతీసిందన్నారు. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు, యువజన నాయకులు చేపడుతున్న శాంతియుత నిరసనలకు ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మద్దతు ప్రకటించారని తెలిపారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తోందన్నారు. నిరసన తెలిపిన విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ధనుంజయ విమర్శించారు. శాంతియుతంగా తమ హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులపై ఇలాంటి చర్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనపై సమగ్ర, నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన ప్రతి విద్యార్థికి న్యాయం చేయాలని, విద్యా వ్యవస్థపై విద్యార్థుల విశ్వాసాన్ని పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని కోరారు. దేశ యువత భవిష్యత్తు, విద్యార్థుల హక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని ఎన్. ధనుంజయ స్పష్టం చేస్తూ, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు అని పేర్కొన్నారు.

## కేంద్ర మంత్రి రాజీనామా పై కాంగ్రెస్ పార్టీ విజయోత్సవ ర్యాలీ



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్ల నరసింహారెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా సందర్భంగా, బడంగ్ పేట్ వినాయక మండపం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ర్యాలీ అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై విద్యార్థులు సాధించిన విజయమని, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు అయినా కాంగ్రెస్ పార్టీ వారికి అండగా నిలుస్తుందని, నీట్ పేపర్ లీకేజ్ పై విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తున్న సమయంలో వారిపై ఎన్నో దాడులకు పాల్పడ్డారని అయినా విద్యార్థులు వెనక్కి తగ్గలేదని తెలుపుతూ వారికి కాంగ్రెస్ పార్టీ అగ్రనేత మద్దతుగా నిలిచారని, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న భారతీయ జనతా పార్టీ తన వైఖరి మార్చుకోవాలంటూ ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ని అరెస్ట్ చేయడాని ఖండిస్తూ, కేంద్ర మంత్రి రాజీనామా కాంగ్రెస్ పార్టీ విజయంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, రంగారెడ్డి జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీంభరత్, రంగారెడ్డి జిల్లా మాజీ జెడ్పి చైర్ పర్సన్ తీగల అనిత రెడ్డి, బడంగ్పేట్ డివిజన్ ప్రెసిడెంట్ బంగారి అశోక్, మీర్పేట్ ప్రెసిడెంట్ చల్లా బాల్ రెడ్డి, జిల్లెలగూడ సిద్ధల శ్రీశైలం, ప్రశాంతి హిల్స్ ప్రెసిడెంట్ సురేందర్ రెడ్డి, నాదర్గుల్ ప్రెసిడెంట్ బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, బాలాపూర్ ప్రెసిడెంట్ శ్రీరాములు, బడంగ్ పేట్ సర్కిల్ లోని కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్, కార్యకర్తలు మరియు అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొని ర్యాలీనీ విజయవంతం చేయడం జరిగింది.

## బిఆర్ఎస్ కటౌట్ల తొలగింపుపై నార్సింగి మున్సిపల్ కమిషనర్‌పై బిఆర్ఎస్ నేతల ఆగ్రహం

**నార్సింగి సర్కిల్ బిఆర్ఎస్ అధ్యక్షుడు కే. విష్ణువర్ధన్ రెడ్డి**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని నార్సింగి సర్కిల్ పరిధిలో ఏర్పాటు చేసిన పార్టీ కటౌట్లను అధికారులు ఒకే రోజులో తొలగించడంపై బిఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నార్సింగి సర్కిల్ బిఆర్ఎస్ అధ్యక్షుడు కే. విష్ణువర్ధన్ రెడ్డి నేతృత్వంలో పార్టీ నాయకులు మున్సిపల్ అధికారుల చర్యలను ఖండించారు. ఈ సందర్భంగా కే. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, అధికార పార్టీకి చెందిన కటౌట్లు, బ్యానర్లు నెలల తరబడి అలాగే ఉన్నప్పటికీ అధికారులు వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. అయితే బిఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన కటౌట్లను మాత్రం మరుసటి రోజే తొలగించడం పక్షపాత ధోరణికి నిదర్శనమని విమర్శించారు. నార్సింగి సర్కిల్ కమిషనర్ కావాలనే బిఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు రాజకీయ పక్షపాతం వీడి అన్ని పార్టీలకు ఒకే విధమైన నిబంధనలు అమలు చేయాలని, ఎవరి కటౌట్లు అయినా కనీసం వారం రోజుల పాటు కొనసాగేలా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో బిఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలు, కటౌట్ల విషయంలో అధికారులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా నిష్పాక్షికంగా వ్యవహరించాలని, లేకపోతే పార్టీ తరఫున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కే. విష్ణువర్ధన్ రెడ్డి హెచ్చరించారు.

## కాటేదాన్ డివిజన్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ మందకొడిగా సాగుతుంది

**కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్**





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని కాటేదాన్ డివిజన్ నేతాజీనగర్, వెంకటేశ్వర కాలనీ, శ్రీరామ్‌నగర్ కాలనీలో ఎస్ఐఆర్ అధికారులతో కలిసి ఇంటింటి వెళ్లే కార్యక్రమంలో కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలలో ఎస్ఐఆర్ ప్రక్రియ జరిగే విధానం గురించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాలా మంది బిఎల్‌వోలు ఇంకా పోలింగ్ స్టేషన్లకే పరిమితమైపోయారన్నారు. దీంతో ఇంటింటికి ఎన్యూమరేషన్ ఫారాలు చేరడం ఆశించిన స్థాయిలో జరగడం లేదన్నారు. ఇప్పటి వరకు ప్రక్రియ సుమారు 40 శాతం మాత్రమే పూర్తయిందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే గడువు ఎంత పెంచినా లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమే అన్నారు. బీఎల్‌వోలు కేవలం పోలింగ్ బూత్‌లలో కూర్చొని ఇతరులకు చెప్పిన సమాచారం ఆధారంగా డిలిట్, షిఫ్టెడ్, డెత్, డబుల్, ఫేక్ ఓటర్స్ నమోదు చేయకూడదు ఇంటింటికి వెళ్లి సంబంధిత కుటుంబ సభ్యుల నుంచే నేరుగా సమాచారం సేకరించి, అవసరమైన పత్రాలు పరిశీలించిన తర్వాతే నమోదు చేయాలన్నారు. లేకపోతే అర్హులైన ఓటర్ల పేర్లు పొరపాటున తొలగిపోయే ప్రమాదం ఉందన్నారు. ఓటు హక్కు రక్షణ కోసం క్షేత్రస్థాయి ధృవీకరణ తప్పనిసరి అన్నారు. ప్రతి నమోదు వాస్తవాల ఆధారంగా ఉండాలి, ఊహలు, వినికిడి సమాచారంపై కాదన్నారు. అందువల్ల దీనికి సంబంధించిన ఎమ్మార్వో, సంబంధితన ఎన్నికల అధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి ఎన్యూమరేషన్ ఫారం చేరితేనే ప్రతి అర్హుడి ఓటు హక్కు రక్షించబడతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిపివో యుగేందర్‌రెడ్డి, సివోలు విజేందర్, ఉపేందర్, వీఆర్‌వో సరిత, బీఎల్‌వోలు అరుణరెడ్డి, శ్రీదేవి, సురేష్, రాధిక, కొంపల్లి జగదీష్ నేత, వెంకటరమణ కురువ, రామారావు, కార్మిక విభాగ అధ్యక్షులు ఉప్పల్ శ్రీను, అనిల్, రవి, సింహాద్రి, రిషి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

## పట్నం మహేందర్ రెడ్డి మాతృమూర్తి రుక్కమ్మకు మాజీ ఎంపీ డా. జి. రంజిత్ రెడ్డి నివాళి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాతృమూర్తి రుక్కమ్మ గారి పార్థివ దేహానికి చేవెళ్ల మాజీ పార్లమెంట్ సభ్యుడు డా. జి. రంజిత్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రుక్కమ్మ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించిన డా. రంజిత్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు నరేందర్ రెడ్డి, అవినాష్ రెడ్డి తదితరులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. రుక్కమ్మ మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొన్న ఆయన, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు కూడా నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

# మేక్ ఇన్ ఇండియా'కు వైద్యరంగంలో మరో మైలురాయి

## భారతీయ వైద్యుల రూపకల్పనలో దేశీయ హెచ్‌టిఓ ఇంప్లాంట్ ఆవిష్కరణ

## మెడికవర్ హాస్పిటల్స్‌లో విజయవంతమైన జాయింట్ ప్రిజర్వేషన్ శస్త్రచికిత్స



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** భారతీయ వైద్యరంగంలో 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి మరో కీలక మైలురాయి చేరింది. భారతీయ ఆర్థోపెడిక్ నిపుణుల రూపకల్పనలో, సిరోనిక్స్ సంస్థ దేశీయంగా తయారు చేసిన హై టిబియల్ ఆస్టియోటమీ (హెచ్‌టిఓ) ఇంప్లాంట్‌ను మెడికవర్ హాస్పిటల్స్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఆవిష్కరించారు. దిగుమతి ఇంప్లాంట్లకు ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చేసిన ఈ సాంకేతికత మోకాలి కీళ్లను సహజంగానే ఎక్కువకాలం పరిరక్షించే దిశగా కీలక ముందడుగుగా వైద్య నిపుణులు అభివర్ణించారు. ఈ సందర్భంగా మోకాలి కార్టిలేజ్ తీవ్రంగా దెబ్బతినడంతో పాటు మోకాలి అమరికలో లోపం (మాల్‌అలైన్‌మెంట్) కారణంగా తీవ్ర నొప్పితో బాధపడుతున్న 28 ఏళ్ల యువ వైద్యుడికి ఈ దేశీయ హెచ్‌టిఓ ఇంప్లాంట్‌తో విజయవంతమైన జాయింట్ ప్రిజర్వేషన్ శస్త్రచికిత్స నిర్వహించారు. రోగికి హై టిబియల్ ఆస్టియోటమీ (హెచ్‌టిఓ)తో పాటు ఆటోలాగస్ కాన్డ్రోసైట్ ఇంప్లాంటేషన్ చేసి దెబ్బతిన్న కార్టిలేజ్‌ను పునరుద్ధరించారు. ప్రస్తుతం ఆయన వేగంగా కోలుకుంటూ సాధారణ జీవితంలోకి తిరిగి వస్తున్నట్లు వైద్యులు వెల్లడించారు. ఈ అత్యాధునిక శస్త్రచికిత్సను మెడికవర్ హాస్పిటల్స్ సీనియర్ జాయింట్ ప్రిజర్వేషన్, స్పోర్ట్స్ ఇంజరీ సర్జన్ డా. రఘువీర్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించారు. 25 సంవత్సరాలకు పైగా అనుభవం కలిగిన ఆయన ఈ దేశీయ హెచ్‌టిఓ ఇంప్లాంట్ రూపకల్పనలో కూడా కీలక పాత్ర పోషించడం విశేషం. ఈ సందర్భంగా డా. రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి మోకాలి నొప్పికి మోకాలి మార్పిడి అవసరం ఉండదన్నారు. ముఖ్యంగా 55 సంవత్సరాల లోపు వయస్సు ఉన్నవారు, ప్రారంభ లేదా మధ్యదశ ఆర్థరైటిస్, క్రీడా గాయాలు, కార్టిలేజ్ దెబ్బతినడం లేదా మోకాలి అమరికలో లోపం ఉన్న రోగులకు జాయింట్ ప్రిజర్వేషన్ సర్జరీ ఉత్తమ ఫలితాలను అందిస్తుందని తెలిపారు. సరైన సమయంలో చికిత్స అందిస్తే సహజ మోకాలిని 10 నుంచి 20 సంవత్సరాల వరకు పరిరక్షించే అవకాశం ఉంటుందని, అనేక సందర్భాల్లో అవసరాన్ని వాయిదా వేయడమే కాకుండా పూర్తిగా నివారించవచ్చని వివరించారు. హై టిబియల్ ఆస్టియోటమీ ద్వారా మోకాలి కింద ఉన్న టిబియా ఎముక అమరికను శాస్త్రీయంగా సరిచేసి, శరీర బరువును దెబ్బతిన్న భాగం నుంచి ఆరోగ్యకరమైన భాగానికి మళ్లించడం జరుగుతుందని ఆయన చెప్పారు. దీంతో నొప్పి తగ్గడమే కాకుండా ఆర్థరైటిస్ పురోగతి మందగించి, సహజ మోకాలి పనితీరు ఎక్కువకాలం కొనసాగుతుందని వివరించారు. మెడికవర్ హాస్పిటల్స్ డైరెక్టర్ డా. శరత్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలోనే అభివృద్ధి చేసిన ఈ హెచ్‌టిఓ ఇంప్లాంట్ విజయవంతంగా క్లినికల్ ప్రాక్టీస్‌లోకి రావడం దేశీయ వైద్యరంగానికి గర్వకారణమన్నారు. ప్రపంచస్థాయి వైద్య సాంకేతికతను భారతీయ రోగులకు అందుబాటు ధరల్లో అందించాలన్న 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. యువ రోగులు సహజ మోకాలిని ఎక్కువకాలం కాపాడుకునే అవకాశాన్ని ఈ సాంకేతికత కల్పిస్తుందని తెలిపారు. తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ సొసైటీ మాజీ అధ్యక్షుడు ప్రొ. జి.వి.ఎస్.మూర్తి మాట్లాడుతూ భారతీయ వైద్యుల పరిశోధనతో రూపొందిన ఈ దేశీయ హెచ్‌టిఓ ఇంప్లాంట్ క్లినికల్ ప్రాక్టీస్‌లో విజయవంతంగా వినియోగించబడటం భారత ఆర్థోపెడిక్ రంగానికి గర్వకారణమన్నారు. ప్రపంచస్థాయి నాణ్యతతో దేశీయ ఆవిష్కరణలు ముందుకు వస్తున్నాయని, యువ రోగుల్లో సహజ మోకాళ్లను పరిరక్షించే చికిత్సలకు ఇది మరింత ఊతమిస్తుందని చెప్పారు. డా. రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ మోకాలి నొప్పిని నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే ఆర్థోపెడిక్ నిపుణులను సంప్రదించి ఎంఆర్ఐ, అమరిక మూల్యాంకనం, మృదులాస్థి అంచనా వంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆధునిక జాయింట్ ప్రిజర్వేషన్ చికిత్సలతో సహజ మోకాలినే ఎక్కువకాలం కాపాడుకోవచ్చని, ప్రతి రోగి ఆరోగ్యంగా, చురుకుగా జీవించేలా చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ వివరాలను మెడికవర్ హాస్పిటల్స్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డా. రఘువీర్ రెడ్డి, డా. శరత్ రెడ్డి, ప్రొ. జి.వి.ఎస్. మూర్తి, ఆర్థోపెడిక్ విభాగానికి చెందిన సీనియర్ వైద్యులు, ఆర్థోపెడిక్ అసోసియేషన్ ప్రతినిధులు మరియు చికిత్స పొందిన యువ వైద్యుడు వెల్లడించారు.



## తొలి ఏకాదశి వేళ

## శ్రీ వెంకన్న గుట్టకు పోటెత్తిన భక్తజనం

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ వెంకన్న గుట్ట ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని శ్రీమన్నారాయణ స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి దర్శనం కోసం ఆలయ ప్రాంగణంలో భక్తులు బారులు తీరగా, "జై శ్రీమన్నారాయణ" నినాదాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, హారతులు వైభవంగా నిర్వహించగా, అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేసి, క్యూలైన్ల ద్వారా సజావుగా దర్శనం కల్పించారు. తొలి ఏకాదశి సందర్భంగా స్వామివారి ఆశీస్సులు పొందిన భక్తులు తమ కుటుంబాల ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, శాంతి సౌభాగ్యాలు కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా శ్రీ వెంకన్న గుట్ట ఆధ్యాత్మిక భక్తి ప్రవాహంతో కళకళలాడుతూ భక్తి పారవశ్యానికి కేంద్రంగా నిలిచింది.

# చైన్‌స్నాచర్ ఆటకట్టు

### సాంకేతిక ఆధారాలతో నిందితుడి అరెస్టు

### బంగారు ఆభరణాలు, స్కూటీ స్వాధీనం.. పలు రాష్ట్రాల్లో కేసులు



**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, జూలై 25:** అంతర్రాష్ట్ర స్థాయిలో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న షేక్ నాగుల్ మీరాను మిర్యాలగూడ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రెండు తులాల బంగారు పుస్తెలతాడు, 4.3 తులాల బంగారు చైన్, ఒక తులం నల్లపూసల గొలుసు, యాక్టీవా స్కూటీ, రెడ్‌మీ ఏ2 స్మార్ట్‌ఫోన్, టోపీ, కర్చీఫ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు నల్లగొండ జిల్లా అదనపు ఎస్పీ జి. రమేష్ తెలిపారు. శనివారం మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 12న హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎన్వీఆర్--పీవీఆర్ గార్డెన్స్ వెనుక నివాసముంటున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు ఇంటి ముందు ఉండగా నిందితుడు చిరునామా అడుగుతున్నట్లు నటించాడు. ఆమె ఫోన్‌లో మాట్లాడుతూనే కరివేపాకు కోస్తుండగా, కరివేపాకు కావాలని అడిగి దగ్గరకు వెళ్లి ఒక్కసారిగా ఆమె మెడలోని బంగారు ఆభరణాలను లాక్కొని పరారైనట్లు తెలిపారు. శనివారం పట్టణంలోని ఫ్లైఓవర్ సమీపంలో మరో చైన్‌స్నాచింగ్‌కు యత్నిస్తుండగా నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కేసును ఛేదించి నిందితుడిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. నిందితుడు ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం నారాయణపురానికి చెందినవాడని తెలిపారు. దాచేపల్లిలో హత్య కేసులో నిందితుడిగా ఉన్న అతడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్లు చెప్పారు. కర్ణాటకలో అతడిపై ఎనిమిది చైన్‌స్నాచింగ్ కేసులు, రెండు దోపిడీ కేసులు నమోదైనట్లు వెల్లడించారు. కేసును ఇన్‌చార్జి డీఎస్పీ రవి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ నాగభూషణరావు, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, ప్రొబేషనరీ ఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ రాజారాం, కానిస్టేబుళ్లు నల్లగాంతుల శ్రీను, శీలం వెంకటేశ్వర్లు, గద్దల హుస్సేన్, బి. వీరబాబు, జె. నర్సింహ, ప్రసాద్‌లు ఛేదించారు. దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన పోలీసు బృందాన్ని అదనపు ఎస్పీ జి. రమేష్ అభినందించారు.

## నేడు చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఏ ల సమావేశం

### మడపతి చంద్రమౌళి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,

### బొల్లారం వెంకట్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** శంకర్‌పల్లి మండల మరియు మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు ముఖ్య విజ్ఞప్తి కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు తెలియజేయునది ఏమనగా, రేపు ఉదయం 10:00 గంటలకు చేవెళ్లలోని అట్లాస్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ బీఎల్‌ఏల సమావేశం నిర్వహించబడుతుంది. అందువల్ల కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, కౌన్సిలర్లు, గ్రామ అధ్యక్షులు, బీఎల్‌ఏలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పార్టీ శ్రేణులందరూ తప్పనిసరిగా పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయవలసిందిగా మనవి. స్థలం: అట్లాస్ ఫంక్షన్ హాల్, చేవెళ్ల సమయం: ఉదయం 10:00 గంటలకు ఇట్లు, మడపతి చంద్రమౌళి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు

# గగన్‌పహాడ్--కాటేదాన్--రాజేంద్రనగర్ రహదారుల దుస్థితిపై బీజేపీ ఆందోళన

### ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆపాలని ప్రభుత్వానికి, జీహెచ్ఎంసీకి బీజేపీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు వినయ్ రెడ్డి డిమాండ్

గండిపేట(క్రైమ్ మిర్రర్): గగన్‌పహాడ్, కాటేదాన్, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు సురెడ్డి వినయ్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ వేలాది మంది వాహనదారులు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు ఈ రహదారులపై ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో రహదారి మధ్యలోనే విద్యుత్ స్తంభాలు ఉండటం వల్ల ప్రమాదాల ముప్పు మరింత పెరిగిందన్నారు. వర్షాల కారణంగా గుంతలు మరింత లోతుగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయంతో ప్రజలు ప్రయాణిస్తున్నారని తెలిపారు. గగన్‌పహాడ్ నుంచి ఆరాంఘర్ వైపు రోజంతా తీవ్ర ట్రాఫిక్ జామ్ నెలకొంటుండటంతో ఉద్యోగులు, విద్యార్థులు, అత్యవసర సేవలు వినియోగించే ప్రజలు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి స్థానికుల నిత్యజీవితాన్ని



తీవ్రంగా ప్రభావితం చేస్తోందన్నారు. ఈ సమస్యలను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం కనిపించలేదని విమర్శించారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన అంశాల్లో నిర్లక్ష్యం ప్రదర్శించడం తగదని హెచ్చరించారు. ఈ సందర్భంగా బీజేపీ తరఫున గగన్‌పహాడ్--కాటేదాన్--రాజేంద్రనగర్ ప్రధాన రహదారులను అత్యవసరంగా పునర్నిర్మించాలని, రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ప్రమాదాలకు కారణమవుతున్న గుంతలను తక్షణమే పూడ్చి ప్రజలకు సురక్షితమైన రహదారులు అందుబాటులోకి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలు స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖ వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రజల తరఫున భారతీయ జనతా పార్టీ ప్రజాస్వామ్యబద్ధంగా తన ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తుందని బీజేపీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు సురెడ్డి వినయ్ రెడ్డి హెచ్చరించారు.

# అరుదైన 'ఎస్ఎంఏ' వ్యాధితో పోరాడుతున్న చిన్నారి కృష్ణ

### అండగా బండ్లగూడ చిన్నారులు విరాళాల సేకరణ

### చిన్నారి కృష్ణకు జీవితం ఇద్దాం" అనే సందేశంతో ప్లకార్డులు

### విరాళాల హుండీలు పట్టుకుని ప్రజలను ఆర్థిక సహాయం చేయాలని విజ్ఞప్తి

### తోటి చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు ముందుకు వచ్చిన చిన్నారులు

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 25: అరుదైన జన్యుపరమైన వ్యాధి స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ తో బాధపడుతున్న చిన్నారి కృష్ణ చికిత్స కోసం పటాన్‌చెరు నియోజకవర్గంలోని బండ్లగూడకు చెందిన చిన్నారులు మానవత్వాన్ని చాటుతూ విరాళాల సేకరణ చేపట్టారు. "చిన్నారి కృష్ణకు జీవితం ఇద్దాం" అనే సందేశంతో ప్లకార్డులు, విరాళాల హుండీలు పట్టుకుని ప్రజలను ఆర్థిక సహాయం చేయాలని కోరుతున్నారు. చిన్న వయస్సులోనే తోటి చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు ముందుకు వచ్చిన వీరి సేవాభావం స్థానికులను కదిలిస్తోంది. క్యూఆర్ కోడ్ ద్వారా డిజిటల్ విరాళాలు, నగదు రూపంలో చందాలు సేకరిస్తూ చిన్నారి చికిత్సకు తమవంతు సహకారం అందిస్తున్నారు. స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ అనేది నాడీ వ్యవస్థ, కండరాలపై తీవ్ర ప్రభావం చూపే అరుదైన జన్యుపరమైన వ్యాధి. ఈ వ్యాధి బారినపడిన చిన్నారుల్లో కండరాలు క్రమంగా బలహీనపడటం వల్ల చేతులు, కాళ్లు కదపడం, తల నిలపడం, ఆహారం మింగడం, చివరకు శ్వాస తీసుకోవడం కూడా కష్టంగా మారుతుంది.




ముఖ్యంగా ఎస్ఎంఏ టైప్--1 అత్యంత ప్రమాదకరమైన రూపంగా వైద్యులు పేర్కొంటున్నారు. ఈ వ్యాధికి అందుబాటులో ఉన్న జన్యు చికిత్స అత్యంత ఖరీదైనది కావడంతో బాధిత కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో దాతలు ముందుకు వచ్చి చిన్నారి కృష్ణ చికిత్సకు తమకు తోచిన ఆర్థిక సహాయం అందించాలని బండ్లగూడ చిన్నారులు, స్థానికులు విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో కొనసాగుతున్న "బేబీ కృష్ణ ఫైట్స్ ఎస్ఎంఏ" ప్రచారం లేదా క్యూఆర్ కోడ్ ద్వారా విరాళాలు అందించి చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు సహకరించాలని కోరారు.



## ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

**మునుగోడు క్రైమ్ మిర్రర్:** మునుగోడు మండల వ్యాప్తంగా పలు ఆలయాల్లో తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు.మండల కేంద్రంలోని శ్రీ శివరామాలయం,రామాలయం,భక్త మార్కండేయ దేవాలయంలో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. భక్త మార్కండేయ దేవాలయంలో నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకులు తిరందాసు ప్రవీణ్ కుమార్ పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు..ఆలయ అధ్యక్షులు కృపానంద్,సంజయ్, జ్ఞాని,భారతీ,మహిళ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

## అనాథ చిన్నారులతో వర్ణిక శ్రీ, విహాన్ తేజ్ జన్మదిన వేడుకలు



**క్రైమ్ మిర్రర్, ఎల్బీనగర్, జూలై 25:** కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం స్థానిక అనాథ పిల్లల పాఠశాలలో వర్ణిక శ్రీ మొదటి జన్మదినం, ఆమె సోదరుడు విహాన్ తేజ్ జన్మదినం సందర్భంగా అల్పాహార సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 300 మంది చిన్నారులకు రుచికరమైన అల్పాహారాన్ని అందజేశారు. చిన్నారులు ఆనందంగా అల్పాహారాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షులు డా. కపిల్ కుమార్ అగర్వాల్‌తో పాటు సమితి సభ్యులు పాల్గొని వర్ణిక శ్రీ, విహాన్ తేజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కుటుంబ సభ్యులు, పాఠశాల చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ, కుటుంబ సభ్యుల పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, ఇతర శుభ సందర్భాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహించాలనుకునే వారు కృష్ణ గోపాల్ సేవా సమితిని సంప్రదించాలని కోరారు.

## ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలి



**క్రైమ్ మిర్రర్ ఖమ్మం :** నేలకొండపల్లి ప్రస్తుత పరిస్థితులలో ఆరుతడి పంటలనే సాగు చేసుకోవాలని ఆజయ్ తండా పంచాయతీ సర్పంచ్ తేజావత్ శివాజీ సూచించారు. మండలం లోని ఆజయతండా లో శనివారం రైతులకు అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...వాతావరణం అనుకూలంగా ఉన్న పంటలనే సాగు చేసుకోవాలని అన్నారు. నీటి శాతం తక్కువగా ఉన్నందున్న రైతులు వరిక బదులు ప్రత్యామ్నయ పంటలను వేసుకోవాలన్నారు. ఆరుతడి పంటలైన పెసర, కంది, మినుము ఇతరత్రా పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ఎల్నినో ప్రభావం ప్రమాధకరంగా మారే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారని పేర్కోన్నారు. కుంటల వలన రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. కావునా రైతులు ఈ 'అవకాశం ను వినియోగించుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితులదృష్ట్యా ప్రత్యామ్నాయ పంటల ను సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీరణాధికారి శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి బైరం దినేష్కుమార్, వార్డు సభ్యులు బాషా, సుశీల, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు వెంకటేశ్వర్లు, వీఓ అధ్యక్షురాలు సక్కుబాయి, గ్రామదీపిక కవిత, ఆశా వర్కర్ విజయ తదితరులు. పాల్గొన్నారు.

# నీట్... నమ్మకానికి పరీక్ష

### పేపర్ లీక్‌లు, పరీక్షలపై వివాదాలు... ప్రశ్నార్థకమవుతున్న విద్యార్థుల భవిష్యత్తు

### వ్యవస్థలపై నమ్మకాన్ని కలిగించడం ప్రభుత్వాల ముందున్న అతిపెద్ద బాధ్యత

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 25(క్రైమ్ మిర్రర్):** ప్రశ్నాపత్రం లీక్‌కు పునఃపరీక్ష ప్రత్యామ్నాయం కావచ్చు. కానీ పరీక్షా వ్యవస్థలపై దెబ్బతిన్న విశ్వాసానికి అలాంటి ప్రత్యామ్నాయం లేదు. ఆ నష్టం ఒక విద్యార్థిదే కాదు... ఒక తరం భవిష్యత్తుదే. ఒక దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో రూపుదిద్దుకుంటుంది. ఆ భవిష్యత్తుకు ద్వారంగా నిలిచేది పరీక్షా వ్యవస్థ. ప్రతిభను గుర్తించి సమాన అవకాశాలు కల్పించడమే పరీక్షల అసలు లక్ష్యం. కానీ పరీక్షల నిర్వహణపై సందేహాలు తలెత్తిన ప్రతిసారీ ప్రశ్నార్థకమయ్యేది కేవలం ఒక పరీక్ష కాదు... మొత్తం విద్యా వ్యవస్థ విశ్వసనీయత. ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు వైద్య విద్యలో ప్రవేశం కోసం నీట్ పరీక్ష రాస్తున్నారు. ఆ పరీక్ష వెనుక కేవలం కొన్ని గంటల పరీక్షా సమయం మాత్రమే ఉండదు. ఎన్నో సంవత్సరాల కృషి, కుటుంబాల త్యాగం, ఆర్థిక భారం, భవిష్యత్తుపై ఆశలు దాగి ఉంటాయి. అలాంటి పరీక్షలపై పేపర్ లీక్‌లు, అక్రమాల ఆరోపణలు వినిపించిన ప్రతిసారీ విద్యార్థుల మనసులో ఒక్క ప్రశ్నే మెదులుతోంది – మా కష్టానికి నిజంగా విలువ ఉంటుందా?"

**పేపర్ లీక్ కాదు... వ్యవస్థలపై నమ్మకం పోతుంది**

ప్రశ్నాపత్రం లీక్ కావడం కేవలం ఒక నేరం మాత్రమే కాదు. అది నిజాయితీగా శ్రమించిన లక్షలాది మంది విద్యార్థుల నమ్మకంపై దెబ్బ. సమాన అవకాశాలపై విశ్వాసాన్ని దెబ్బతీసే చర్య. ప్రతిభను గుర్తించే పరీక్షా వ్యవస్థపై సమాజంలో సందేహాలను పెంచే పరిణామం. ఒక పరీక్షను మళ్లీ నిర్వహించడం సాధ్యమే కావచ్చు. కానీ పరీక్షా వ్యవస్థపై దెబ్బతిన్న విశ్వాసాన్ని తిరిగి నిలబెట్టడం అంత సులభం కాదు. ఇటీవలి కాలంలో నీట్‌తో పాటు పలు ప్రభుత్వ నియామక పరీక్షలు, ప్రవేశ పరీక్షలపై కూడా వివిధ ఆరోపణలు, వివాదాలు చోటుచేసుకున్నాయి. ప్రతి ఘటనకు సంబంధించిన వాస్తవాలు దర్యాప్తు, న్యాయపరమైన ప్రక్రియల ద్వారా తేలాల్సిందే. అయితే అలాంటి ఘటనలు విద్యార్థుల్లో కలిగించే ఆందోళన, అనిశ్చితి మాత్రం వెంటనే తొలగిపోవు. అందుకే పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రత, జవాబుదారీతనం మరింత బలోపేతం కావాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. పరీక్ష అనేది కేవలం మార్కులు కేటాయించే ప్రక్రియ కాదు. అది ప్రతిభకు సమాన అవకాశాలు కల్పించే వ్యవస్థ. ఆ వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రులు, సమాజం ఉంచిన విశ్వాసాన్ని కాపాడడం ఏ ప్రభుత్వానికైనా, ప్రతి పరీక్షా సంస్థకైనా అత్యంత కీలకమైన బాధ్యత.

**ఒక సీటు వెనుక... ఒక కుటుంబం కల ఉంటుంది**

నీట్ లాంటి పరీక్షలో ర్యాంకు సాధించడం ఒక విద్యార్థి వ్యక్తిగత విజయం మాత్రమే కాదు. అది ఒక కుటుంబం చేసిన త్యాగానికి ప్రతిఫలం. అనేక



కుటుంబాలు అప్పులు చేసి కోచింగ్ ఇప్పిస్తాయి. కొందరు తమ అవసరాలను తగ్గించుకుని పిల్లల చదువుకు ప్రాధాన్యం ఇస్తారు. గ్రామాల నుంచి పట్టణాలకు మారి విద్య కోసం కొత్త జీవితాన్ని ప్రారంభించే కుటుంబాలు కూడా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పరీక్షల విశ్వసనీయతపై సందేహాలు తలెత్తితే దెబ్బతినేది కేవలం విద్యార్థి కాదు... ఒక కుటుంబం ఆశ, విశ్వాసం కూడా.

**పోటీ పెరుగుతోంది... ఒత్తిడి కూడా**

నేటి యువత తీవ్రమైన పోటీని ఎదుర్కొంటోంది. పరిమిత సీట్లు, పెరుగుతున్న కోచింగ్ సంస్కృతి, ఆర్థిక ఒత్తిడి, కుటుంబాల అంచనాలు – ఇవన్నీ కలిసి విద్యార్థులపై భారాన్ని పెంచుతున్నాయి. దీనికి తోడు పరీక్షలపై వివాదాలు చోటుచేసుకుంటే ఆందోళన మరింత తీవ్రమవుతుంది.

"ఎంత చదివినా ప్రయోజనం ఏమిటి?" అనే నిరాశ పెరగడం ఏ సమాజానికైనా మంచి సంకేతం కాదు. పరీక్షల్లో విజయం ఎంత ముఖ్యమో, విద్యార్థుల్లో నమ్మకాన్ని నిలబెట్టడం కూడా అంతే ముఖ్యం.

**రాజకీయాలకు అతీతమైన అంశం**

పేపర్ లీక్ లేదా పరీక్షలపై వివాదాలు వచ్చినప్పుడు రాజకీయ చర్చలు జరగడం ప్రజాస్వామ్యంలో సహజం. అధికార, ప్రతిపక్షాలు తమ వాదనలు వినిపిస్తాయి. అయితే ఆ చర్చల మధ్య అసలు బాధితుడైన విద్యార్థి మరుగున పడకూడదు. విద్యార్థికి రాజకీయ విజయం అవసరం లేదు. తన కష్టానికి న్యాయం జరిగే వ్యవస్థ కావాలి. పరీక్షలు నిష్పాక్షికంగా జరుగుతాయనే విశ్వాసం కావాలి. వ్యవస్థను బలోపేతం చేయాల్సిన సమయం ప్రతి ఘటన తర్వాత దర్యాప్తులు, అరెస్టులు, ప్రకటనలు చేయడం అవసరమే. కానీ సమస్య పదేపదే పునరావృతమవుతుంటే వ్యవస్థాపరమైన సంస్కరణల అవసరం స్పష్టమవుతోంది.

**చేయాల్సినవి:**

**సాంకేతిక భద్రత:** ప్రశ్నాపత్రాల భద్రతలో అత్యాధునిక సాంకేతికత, డిజిటల్ ట్రాకింగ్ వినియోగం

**పర్యవేక్షణ:** పరీక్షా కేంద్రాల పర్యవేక్షణ, స్వతంత్ర ఆడిట్

**జవాబుదారీతనం:** అక్రమాలకు పాల్పడే ముఠాలపై వేగవంతమైన చర్యలు

**మానసిక మద్దతు:** పరీక్షల ఒత్తిడిని ఎదుర్కొనే విద్యార్థులకు కౌన్సెలింగ్, మానసిక ఆరోగ్య సహాయ సేవల విస్తరణ

**విద్యార్థి విశ్వాసమే దేశ సంపద**

దేశ అభివృద్ధికి మౌలిక వనరు సహజ వనరులు మాత్రమే కాదు... ప్రతిభావంతమైన యువత కూడా. ఆ ప్రతిభను వెలికితీయాల్సిన పరీక్షా వ్యవస్థపై విశ్వాసం దెబ్బతింటే దాని ప్రభావం ఒక్క తరం మీదే కాదు, దేశ అభివృద్ధిపైనా పడుతుంది. అందుకే పరీక్షలను నిర్వహించడం మాత్రమే కాదు, వాటిపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడం కూడా ప్రభుత్వాలు, పరీక్షా సంస్థలు, సమాజం కలిసి నిర్వర్తించాల్సిన బాధ్యత. పరీక్షల్లో గెలుపు, ఓటములు సహజం. కానీ పరీక్షా వ్యవస్థపై విశ్వాసం కోల్పోవడం మాత్రం ఏ దేశానికైనా ప్రమాదకరం. పరీక్షా హాల్లో కూర్చున్న ప్రతి విద్యార్థి ఒక ర్యాంకు కోసం మాత్రమే పోరాడటం లేదు. తన కల కోసం, తన కుటుంబం కోసం, తన భవిష్యత్తు కోసం పోరాడుతున్నాడు. ఆ పోరాటానికి న్యాయం జరిగేలా చూడటం మనందరి బాధ్యత. పేపర్ లీక్‌లను అరికట్టడం పరిపాలనా చర్య మాత్రమే కాదు... అది ఒక తరం ఆశలను, దేశ భవిష్యత్తును కాపాడే జాతీయ కర్తవ్యం. పరీక్షలో మార్కులు కోల్పోతే ఒక విద్యార్థి నష్టపోతాడు. కానీ పరీక్షా వ్యవస్థపై నమ్మకం కోల్పోతే నష్టపోయేది దేశ భవిష్యత్తే.

# అనారోగ్యానికి గురయిన అభిజిత్ దీప్కే

### టైఫాయిడ్ వచ్చిందని స్వయంగా వెల్లడి

న్యూఢిల్లీ,జూలై25(ఆర్ఎన్ఎ): కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అనారోగ్యానికి గురయ్యారు. నీట్ పేపర్ లీక్‌పై నెల రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టిన ఆయనకు టైఫాయిడ్ వచ్చింది. తనకు టైఫాయిడ్ వచ్చిన విషయాన్ని సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా అభిజీత్ దీప్కే వెల్లడించారు. తనకు టైఫాయిడ్ వచ్చిందని, చికిత్స తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల వైద్య పరీక్షలు చేయించగా వ్యాధి నిర్ధారణ అయినట్లు చెప్పారు. ప్రస్తుతం రోజుకు రెండుసార్లు ఇంట్రావీనస్ చికిత్స తీసుకుంటున్నట్లు దీప్కే పేర్కొన్నారు. తాను అనారోగ్యానికి గురైనా విద్యా వ్యవస్థలో జవాబుదారీ తనం కోరుతూ చేపట్టిన నిరసన దీక్ష మాత్రం కొనసాగుతుందని చెప్పారు. అలాగే, నీట్ పేపర్ లీక్ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని అభిజీత్ తన వీడియో సందేశంలో తేల్చి చెప్పారు. మరోవైపు, దీప్కేతో పాటు పలువురు సీజేపీ మద్దతుదారులు, కార్యకర్తలు కూడా అనారోగ్యానికి గురైనట్లు తెలుస్తోంది. 'అందరికీ నమస్కారం. కొన్ని రోజులుగా నా ఆరోగ్యం బాగోలేదని మీ అందరికీ తెలుసు. అందుకే రక్త పరీక్షలు చేయించాను. రిపోర్టుల్లో టైఫాయిడ్ అని నిర్ధారణ అయింది. చికిత్స కొనసాగుతోంది. నాకు ప్రతి ఉదయం, సాయంత్రం ఐవీ డ్రిప్స్ పెడుతున్నారు. దేశవ్యాప్తంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బొద్దింకలందరికీ నేను నిజంగా ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నా. మీ వల్లే ఈ ఉద్యమం ఇంత విజయవంతమైంది. మీ అందరికీ చాలా చాలా ధన్యవాదాలు. ఈ ఉద్యమాన్ని ఇంత పెద్ద విజయంగా మార్చినందుకు మీ అందరికీ అభినందనలు. నీట్ పేపర్ లీక్ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ చేపట్టిన ఉద్యమం కొనసాగుతుంది' అని అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు.

GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.